
₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 8 సంచిక - 17
పక్షపత్రిక సెప్టెంబర్ 1-15, 2017

## ప్రజల భాగస్వామ్యంతో భూముల రీ సర్వే చేయాలి






## చట్టబద్ధ పాలన లేకుండానే 70 ఏళ్లు, 70 విజయాలు

## జనహితం కోసం జేపీ సురాజ్యయాత్ర (నేతలు - యాత్రలు)



# స్థానిక స్వయంపాలనకు ప్రాధాన్యమివ్వండి
## -ఐఏఎస్ ప్రొబేషనర్లకు జేపీ సూచన -

ఐఏఎస్ ప్రొబేషనర్ అధికారుల (2016 బ్యాచ్) ఇష్టాగోష్టి సమావేశంలో ఇటీవల లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పాల్గొన్నారు. బాధ్యతల్ని సక్రమంగా నెరవేర్చే సత్తాని ప్రదర్శించటం, స్థానిక ప్రభుత్వాలు, బృందాలకు సాధికారతనందించటం, ఎప్పటికప్పుడు అత్యుత్తమ విధానాలను అనుసరించటం/అభివృద్ధి చేయటం అంశాలకు ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలని ఐఏఎస్ కొత్త బ్యాచ్‌కి జేపీ సూచించారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

సెప్టెంబర్ 1-15, 2017 సంపుటి - 8 సంచిక - 17




గుర్మీత్ దేరా ఉన్న జైలు

కాఠిన కార్యం

## లోపలి పేజీల్లో...


జనహితం కోసం జేపీ సురాజ్యయాత్ర............ 5
ఒకచోట అధికారులు, ఇంకోచోట నేతలు....... 9
మహిళలపై వేధింపుల్లో ముందున్న................ 10
వైద్యం ఎలా అందుతోందమ్మా?...................... 12
విద్య, ఆరోగ్యంపై పెట్టుబడులు పెరగాలి............ 13
2వ తరగతి పాఠం చదవలేకపోతున్న............ 16
విద్యాసంస్థల ద్వారానైనా దళితులపై దాడులు.... 18
అన్సారీ గణాంక హెచ్చరికలు......................... 19
నవ భారత్ : స్వప్నం సత్యం......................... 20
మోదీ ఎన్నికల బాకీ : తెలంగాణ ధాన్యం.......... 22
సురాజ్యానికి విధానాలేవీ ?.......................... 25
జలవివాదాలపై రెండేళ్ళలోనే తీర్పు................ 26
తెలంగాణ రాష్ట్రానికి నూతన కమిటీల్ని............ 28
ప్రజాస్వామ్య సంస్కరణల కోసం ఎదురు ........... 29
అధికార పిచ్చిని కుదిరిస్తే ఇక్కడా అరుణా .......... 31
(మీడియాలో) 'కీ' కామెంట్లు ! ....................... 32
ప్రజల భాగస్వామ్యంతో శాస్త్రీయంగా .............. 34


సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజీ | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |


♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# చట్టబద్ధపాలన లేకుండానే 70 ఏళ్లు, 70 విజయాలు!



పుట్టుకతో వివక్ష లేకుండా ప్రతి బిడ్డలోని శక్తిసామర్థ్యాలను వెలికితీసి ఎదిగే అవకాశాలను అందించటం, నివారించదగ్గ బాధలను తొలగించటం.. ఈ రెంటి కోసం పనిచేసేదే నిజమైన ప్రజాస్వామ్య ప్రభుత్వం. ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్‌ని, ఆ తర్వాత లోక్‌సత్తాని ఏర్పాటు చేయటం వెనక లక్ష్యం ఇలాంటి ప్రజాస్వామ్య రాజకీయాన్ని, పాలనను సాకారం చేయటమే. కానీ ఇంకా మన పాలకులు ప్రజాస్వామ్యమంటే ఎన్నికలు మాత్రమే అనే భ్రమల్లోనే ప్రజలను కొనసాగిస్తున్నారు. వ్యక్తిగతంగా చాలా నిజాయితీగా ఉన్నాను అంటూ 70 ఏళ్ల స్వాతంత్ర్యం సందర్భంగా 70 పథకాల విజయాలు చాటుకున్న ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఇందుకు మినహాయింపు కాదు. మోదీ జమానాలో మౌలిక మార్పు ఏదైనా వచ్చి ఉంటే.. "ఒక మామూలు వ్యక్తి కడుపున పుట్టకపోవడం, అర్ధరాత్రి ఏదోకచోట ఘోరమైన అత్యాచారానికి గురై దిక్కులేని చావుకుచావకపోవడం నా అదృష్టం" అని చండీగఢ్‌లో వర్ణిక కుందు అనే అమ్మాయి ఎందుకు అంటుంది? ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకులకుమొట్టమొదటి కర్తవ్యం ప్రజలందరికీ భద్రత కల్పించటం, పుట్టుకతో సంబంధం లేకుండా చట్టాన్ని, న్యాయాన్ని అందరికీ సమానంగా వర్తింపచేయటం! కానీ రాచరికపు కాలంలో కంటే ఘోరంగా ఉంది మన చట్టబద్ధ పాలన. ఇలాంటి పాలనలో కులం, మతం, మహిళ వంటి వివక్షకు గురయ్యే వారి పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. హర్యానా బీజేపీ అధ్యక్షుడు సుభాష్ బరాలా కుమారుడు వికాస్ బరాలా తాగి వికృత చేష్టలతో వర్ణికను వేధింపులకు గురిచేయటం ఈ పరిస్థితుల ప్రభావమే! చండీగఢ్‌లో అర్ధరాత్రి వేళ తన అధునాతన వాహనంతో కొన్ని కిలోమీటర్ల మేర ఆమె కారును బరాలా వెంటాడాడు. ఆమె మెస్సేజ్ అందుకున్న పోలీసులు సకాలంలో రావటంతో వర్ణిక బతికిపోయింది. కానీ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికినా నిందితుడు రాష్ట్రంలో, దేశంలో అధికారంలో ఉన్న పార్టీ ప్రముఖుడి కొడుకు అని తెలియటంతో పోలీసులు చట్టబద్ధ బాధ్యతను పక్కనపడేసి తమ బాస్‌ల ఆదేశాలకనుగుణంగా వ్యవహరించారు. ప్రాథమిక పరీక్షలు చేయకుండా నిందితుల్ని వదిలేశారు. సామాజిక మాధ్యమాల్లో వెకిలి విమర్శలకన్నా వర్ణిక పక్షాన వాదనలు, సాక్ష్యాలు బలంగా ఉండి ప్రచారం పొందటంతో ఎట్టకేలకు అపహరణ కేసును నమోదు చేశారు. వర్ణిక ఉదంతంకన్నా ఘోరమైన ఘటనలు మన చుట్టూ చాలా జరుగుతున్నాయి. ఎక్కువ ఆదాయంగలవారు, జాతీయ మీడియా ఉండటం వంటి కారణాలతో ఢిల్లీలో నిర్భయ కేసుకు, బాధితురాలు ఓ ఐఏఎస్ అధికారి కూతురు కావటం, నిందితుడు రాజకీయంగా పలుకుబడి వర్గానికి చెందిన వ్యక్తి కావటం వల్ల చండీగఢ్‌లో వర్ణిక ఉదంతానికి అంత ప్రచారం వచ్చి ఉండవచ్చు. కానీ ఈ ఘటనలు చర్చనీయాంశాలు కావటాన్ని మనం సరైన దిశలో మార్పుల కోసం వినియోగించుకోవాలి భారతదేశానికి స్వాతంత్ర్యం, అమెరికాలో బానిసత్వ విముక్తి దగ్గర్నుంచి ప్రపంచంలో అనేక పెద్దపరిణామాలకు ఉన్నతవర్గాల ప్రమేయం, వారి అపారత్యాగాలు చోదకశక్తులని మర్చిపోకూడదు. తన కేసు పట్ల సమాజం దృష్టిని సరైన దిశలో మళ్లించటంలో వర్ణిక సఫలమైంది. నిర్భయ ఉదంతంలో కూడా బాధితురాలి పేరును చెప్పటానికి మన సమాజం ఇష్టపడలేదు. వైవాహిక రేప్‌ను నేరం అని న్యాయవ్యవస్థ కూడా అనలేని దేశం గదా! కానీ వర్ణిక చాలా ధైర్యంగా ముందుకొచ్చి, 'నా పేరును, ముఖాన్ని దాచుకోవాల్సిన అవసరం లేదు. నేను నేరస్తురాలిని కాదు, బాధితురాలినీ కాదు. ఒక ఆపద నుంచి బైటపడ్డ విజేతను" అని ధీమాగా అన్నారు. ఆపదల బారినపడకుండా ఇలాంటి ధీమాతో ఈ దేశంలోని ప్రతి యువతీ తన రోజువారీ జీవితాన్ని తలెత్తుకుని గడిపే వ్యవస్థను మనం నిర్మించాలి. కులం పేరిట, మహిళలు, రైతుల పట్లా వివక్ష మామూలే అనే మోరల్ న్యూట్రాలిటీని వీడితేనే మనం సమస్య తీవ్రతను అవగాహన చేసుకోగలం. బడికి వెళ్తున్న బాలికలు కూడా చుట్టూ జరుగుతున్న వెకిలిచేష్టలు, అపహరణల భయాలతో వణికిపోతున్నారు. కేవలం అమ్మాయిలకు రక్షణ కల్పించలేకే ఈ దేశంలో ఇప్పటికీ బాల్యవివాహాలు పెద్దసంఖ్యలో జరుగుతున్నాయి. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఇంకెన్ని వేధింపులను ఎదుర్కోవాలోనని యువతులు భయపడుతున్నారు. ఒకవేళ ఫిర్యాదు చేసినా కోర్టుల్లో న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదు. మన క్రిమినల్ న్యాయవ్యవస్థ దాదాపు కుప్పకూలే స్థితిలో ఉంది. నియంత్రణలు ఇలా అరకొరగా ఉండటంతో మహిళలపై వేధింపుల కేసులు పెరిగిపోతున్నాయి. 2014లో 4699 కేసులు నమోదుకాగా, 2016లో 7132 కేసులు నమోదయ్యాయి. గత ఏడాది కేసుల్లో కేవలం 379 కేసుల్లో మాత్రమే, అంటే 5శాతంలోపే శిక్షలు పడ్డాయి. మహిళలపై వేధింపుల్లో తెలుగు రాష్ట్రాలు దేశంలోనే ముందు వరసలో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 2015తో పోలిస్తే 2016లో మహిళలపై వేధింపుల సంఖ్య 15.97శాతం పెరిగింది. గత మూడేళ్లలో 1694 కేసులు నమోదుకాగా, కేవలం 30 కేసుల్లోనే శిక్షలు పడ్డాయి. ఇంకా 424 కేసుల్లో ఛార్జిషీట్లు కూడా దాఖలు చేయలేదు. నిందితుడ్ని కాపాడేందుకుగాను సాక్ష్యాలున్న ఒక కేసును ఉపసంహరించుకోవాలని నిర్ణయించిన ఒకే ఒక్క కారణంగా (క్యాంప్‌బెల్ ఎఫైర్) 93 ఏళ్ల క్రితం బ్రిటన్‌లో ప్రధానమంత్రి రామ్‌సే మెక్‌డొనాల్డ్ ప్రభుత్వం పడిపోయింది. కానీ మనదేశంలో ఇప్పటికీ దోషుల్ని కాపాడటం ప్రభుత్వంలోని పెద్దల కార్యకలాపాల్లో ఓ భాగం. వర్ణిక కేసు, తెలంగాణలో నేరెళ్ల ఉదంతం ఇందుకు కొన్ని తాజా ఉదాహరణలు. మరీ సంచలనం రేగితే ఒకరిద్దరు పోలీసు సిబ్బందిని తాత్కాలికంగా సస్పెండ్ చేయటమో, ట్రాన్స్‌ఫర్ చేయటమో చేస్తున్నారు. అందుకే ముందు నేరదర్యాప్తులో రాజకీయ జోక్యం లేకుండా చేయాలి. పకడ్బందీ సాక్ష్యాధారాల సేకరణ, స్వతంత్ర ప్రాసిక్యూషన్‌ను ఏర్పాటు చేయాలి. ఇందుకు సంబంధించి నిర్దిష్టమైన, జవాబుదారీతనంతో కూడిన పోలీసు సంస్కరణల్ని అమలుచేయాలి. మహిళలపై వేధింపులను సకాలంలో అడ్డుకోకపోవటం వల్ల అవి రేప్, ఇతరత్రా హింసాత్మక దాడుల దాకా పోతోంది. వేధింపుల దశలోనే దోషులను వేగంగా శిక్షించేందుకు స్థానిక న్యాయస్థానాలను 'గ్రామన్యాయాలయాల' చట్టం ద్వారా లోక్‌సత్తా 2009లోనే సాధించింది. వీటిని ఏర్పాటు చేసుకోవటానికి కేంద్రం నుంచే నిధులు వచ్చే అవకాశమున్నా రాష్ట్రాలు వీటిని పట్టించుకోవటం లేదు. తమ డిమాండ్ పడిపోతుందనే భయంతో హైకోర్టులు స్థానిక కోర్టులను నోటిఫై చేయటం లేదు. ఇది జనానికి అర్థమై ఓట్లు తెచ్చే విషయం కాదని రాష్ట్రాల పాలకులు కూడా నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. నేను రెండుసార్లు ముఖ్యమంత్రులకు లేఖ రాశాను. పలుసార్లు అసెంబ్లీలో, బైట వాదించాను. అయినా ఇంతవరకూ తెలంగాణ, ఏపీల్లో ఒక్క స్థానిక కోర్టును కూడా ఏర్పాటు చేయలేదు. మెరుగైన న్యాయమూర్తులు వచ్చేందుకు అఖిల భారత న్యాయ సర్వీసు (ఐజేఎస్) ఏర్పాటుకు కూడా పలు హైకోర్టులు కుంటిసాకులతో అడ్డుచెబుతున్నాయి. తక్షణం స్థానిక న్యాయాలయాలను ఏర్పాటు చేయటంతోపాటు న్యాయవ్యవస్థలో సామర్థ్యాన్ని, జవాబుదారీతనాన్ని పెంచేందుకు సంస్కరణల్ని అమలుచేయాలి. ఇలాంటి మార్పులతో చట్టబద్ధపాలన అమలుచేయటంతోపాటు.. మహిళలు తమలోని శక్తిసామర్థ్యాలను వికసింపచేసుకుని వివక్ష లేకుండా ఎదిగేందుకు నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి, పోలీసు స్టేషన్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు లేని సేవలు అందించే ఏర్పాట్లు చేయాలి. మహిళల పట్ల సమానత్వ భావనను పాఠశాల స్థాయి నుంచి విధిగా నేర్పించాలి. అప్పుడు మాత్రమే ఎర్రకోట ప్రసంగాలక బేటీ బచావ్, సురాజ్యం వంటి నినాదాలకు అర్థం.



# జనహితం కోసం జేపీ సురాజ్యయాత్ర (నేతలు - యాత్రలు)




సాధారణ ఎన్నికలకు ఇంకా రెండు సంవత్సరాల సమయం ఉన్నా ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ వేడి మొదలైంది. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అక్టోబర్ 27 నుంచి పాదయాత్ర మొదలుపెడతానని గుంటూరు వేదికగా జరిగిన పార్టీ ప్లీనరీలో ప్రకటించటంతో ఇది ఒక్కసారిగా రాజుకుంది. ఈ సమావేశంలో ప్రకటించిన ఓ తొమ్మిది స్కీముల్ని పట్టుకుని 'అన్న వస్తున్నాడు.. నవరత్నాలు తెస్తున్నాడు' అంటూ వైకాపా వారు ముమ్మరంగా ప్రచారం చేస్తుండటంతో ప్లీనరీ తీర్మానాలు ఎన్నికల మేనిఫెస్టోగా మారిపోయాయి. దేశంలో ఎన్నికల వ్యూహకర్తగా పేరెన్నికగన్న, ప్రధాని మోదీని గెలిపించిన బ్రాండ్ ఇమేజ్ కలిగిన ప్రశాంత్ కిషోర్‌ను సలహాదారుగా పార్టీ వేదిక మీదే వైఎస్ జగన్ కూర్చోబెట్టు కోవటంతో.. ఎన్నికలు, అధికారమే లక్ష్యమని తేలిపోయింది. ఎలాగైనా ముఖ్యమంత్రి కావాలన్న తన మనసులోని మాటను బహిరంగంగా చాటటానికి వైఎస్ జగన్ ఏమాత్రం సంకోచించటం లేదు. ఇక భావసారూప్యత గలవారితో కుదరకపోతే ఒంటరిపోరుకు సిద్ధమేనని ఇప్పటికే ప్రకటించిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పాదయాత్ర చేస్తానని వైఎస్ జగన్ కంటే ముందే హింట్ ఇచ్చారు. అభిమానులు అనుమతిస్తే.. వంటి షరతుల్ని ఆ తర్వాత జోడించారను కోండి. అధికార తెలుగుదేశం పార్టీ కూడా ఇంటింటికీ ప్రచారం పేరుతో ప్రజల్లోకి వెళ్లాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ఏకరువు పెట్టాలని ప్రయత్నాలు చేస్తోంది. ఇక లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా 100 రోజుల జనచైతన్య యాత్రలు నిర్వహిస్తానని ప్రకటించారు.

పార్టీల ముఖ్యనేతలు ఎన్నికల దృష్టితో యాత్రలు చేపట్టటం తప్పేమీ కాదు. ఒక రాజకీయ పార్టీ ఏదైనా కార్యక్రమం చేస్తే చాలా ఖర్చవుతుంది. అందుకే ఆ ఖర్చుకు, వినియోగించిన శక్తిసామర్థ్యాలకు తగిన ప్రతిఫలం ఉండేలా కార్యక్రమాలు చేపట్టాలను కుంటారు. పార్టీలకు వచ్చే విరాళాలు పారదర్శకంగా, నల్లడబ్బు లేకుండా ఉండాలని మనం డిమాండ్ చేయాలి తప్ప ఎన్నికల దృష్టితో ఓ పెద్ద కార్యక్రమాన్ని చేపట్టాలని ఆ నాయకులు ఆశపడటాన్ని తప్పుపట్టనక్కర్లేదు. కానీ ఇప్పుడు ఏపీలో ఎన్నికలు రెండేళ్లుండగానే ఇలాంటి కార్యక్రమాలు చేపట్టటం మాత్రం కొంత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఎన్నికలు ముందే జరుగుతాయన్న సమాచార ముందో, లేక రెండేళ్లపాటు ఏకధాటిగా కార్యక్రమాలు చేపట్టే నిధులే ఉన్నాయో వాళ్లకు సంబంధించిన అంశం. కానీ ప్రజలు ఆలోచించా ల్సిందేమిటీ?

ముందుగా పాదయాత్రలను తీసుకుందాం. పాదయాత్ర అంటే ప్రజల్లోకి

వెళ్లటమే కాదు, ప్రజల్లో ఉండడం కూడా. ప్రజల కష్టాలను తెలుసు కుంటూ ఆ సమయంలో స్పాట్‌లోనే వారికి నచ్చే నిర్ణయాలను ప్రకటించడం. ప్రజల్ని సమీకరించడానికి ఇదో చక్కటి మార్గం. అందుకే 1930లో (మార్చి 12న ప్రారంభించి) బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా సామాన్యులను ఏకం చేయడానికి గాంధీజీ 'దండి యాత్ర' పేరుతో ఉప్పు సత్యాగ్రహం చేశారు. ఆ తర్వాత వినోబాభావే లాంటి సామాజిక గాంధేయవాదులు ఇదే మార్గంలో పయనించారు. జాతీయోద్యమ తరం కనుమరుగువున్న తరుణంలో జనతాపార్టీ నాయకుడు, మాజీ ప్రధాని 1983లో (జనవరి 6) చంద్రశేఖర్ కన్యాకుమారి నుంచి ఢిల్లీలోని మహాత్మాగాంధీ సమాధి రాజ్‌ఘాట్ వరకు పాదయాత్ర చేశారు. నాలుగువేల కిలోమీటర్ల మేర సాగిన ఈ యాత్ర.. ఎమర్జెన్సీని ప్రకటించిన జూన్ 25వ తేదీన ముగిసింది. ఈ పాదయాత్ర లన్నిటిలో నాయకులకు ఆశించిన లక్ష్యాలు చాలావేరశ సాకార మయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి పాదయాత్ర కూడా ఆయన ముఖ్యమంత్రి కావడానికి దోహదం చేసింది. ఆ తర్వాత తొమ్మిదేళ్ల ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు 'మీ కోసం' పేరుతో సుదీర్ఘ పాదయాత్రను చేపట్టి రాష్ట్ర విభజనానంతర ఆంధ్రప్రదేశ్‌కి ముఖ్యమంత్రి అయ్యారు. కానీ నేతల ఆకాంక్షలను నెరవేరుస్తున్న పాదయాత్రలు ప్రజల కష్టాలను తీరుస్తున్నాయా? అందరికీ ఓటు హక్కు, భావప్రకటనా స్వాతంత్ర్యం లేని రోజుల్లో గాంధీజీ చేసిన దండి యాత్ర గురించి పక్కనపెడితే.. స్వతంత్రం వచ్చాక ముఖ్యంగా రాజకీయ నేతలు చేసిన పాదయాత్రల వల్ల జనానికి ఒరిగిందేమిటి?

ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు పాదయాత్రనే తీసుకుందాం. 'మీ కోసం' యాత్ర ద్వారా ఆయన దాదాపు 200 రోజులు నడిచారు. అనేక మందిని కలిశారు. సమస్యల్ని విన్నారు. కాపు రిజర్వేషన్లు సహా పలు హామీల్ని దేవత లిచ్చే వరాల్లాగా ప్రకటించారు. పాద





యాత్ర వల్ల చంద్రబాబు పట్ల ప్రజల్లో సానుభూతి పెరిగింది. ఈసారి ఎలాగైనా ఆయన్ని గెలిపించాలని భావించే వారి సంఖ్య పెరిగింది. ఈలోగా రాష్ట్ర విభజన ఖరారైంది. చంద్రబాబు ముఖ్యమంత్ర య్యారు. రాష్ట్ర విభజన జరగటంతో తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న జగన్ కంటే అనుభవజ్ఞుడైన చంద్రబాబు మేలని ప్రజలు మొగ్గు చూపారని, ఆయన పాదయాత్ర చేయకపోయినా ముఖ్యమంత్రి అయ్యేవారని కొందరు అంటుంటారు. కానీ పార్టీని బలోపేతం చేసుకోవటానికి, ప్రజల సానుభూతిని పొందటానికి ఆ యాత్ర ఉపయోగపడిందని ఎక్కువమంది అభిప్రాయం. ఆ అభిప్రాయాలు ఎలావున్నా.. బాబు అధికారంలో రావడం వల్ల ప్రజలకు ఏమన్నా ఒరిగిందా?

మూడేళ్లు గడిచాక చూస్తే, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వ పనితీరు పట్ల వ్యతిరేకత కనిపిస్తోంది. అవినీతి తాండవిస్తోందని సర్వేలు చెబుతున్నాయి. అవినీతి తగ్గిందని పారిశ్రామికవేత్తల మధ్య చేసిన తాజా సర్వే చెబుతోందేమోగానీ, లంచాలివ్వనిదే ప్రభుత్వ కార్యాలయాల్లో పనులవ్వటం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పలువురు మంత్రులు భారీ భూకుంభకోణాల ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. కానీ ప్రత్యామ్నాయం లేదు అనే భావన (టీనా ఫ్యాక్టర్) ఇంకా ప్రజల్లో ఉంది. దీనివల్లే చంద్రబాబు బండి లాగిస్తున్నారు.

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ సమయంలో ఉన్న సంస్కరణలు, సుపరిపాలన దృష్టిని 2014 ఎన్నికలలో చంద్రబాబు పూర్తిగా విస్మరించటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ వ్యతిరేకతను ఉపయోగించుకుని ఎన్నికల్లో లబ్ధి పొందాలని ఇప్పుడు జగన్ పాదయాత్ర అంటున్నారు. మూడువేల కిలోమీటర్ల మేర కొన్ని నెలలపాటు ఆయన జనంలో తిరుగుతుంటారు. ఈసారి కూడా ప్రజలు పాపం అనుకుని ఓటు వేయాలని ఆలోచిస్తారా? లేక మెరుగ్గా ఆలోచిస్తారా? చంద్రబాబు పట్ల వ్యతిరేకత ఉన్నవారు, ఆయన పాలన నచ్చనివారు 'అయ్యో జగన్‌బాబు ఎంత కష్టపడిపోతున్నాడు' అని సానుభూతితో ఓటు వేస్తే.. ఆ తర్వాత 'మీ కోసం' తరహాలో మరోసారి నిరాశపడే పరిస్థితి రాదా? వాళ్లిద్దరి పార్టీల ఎజెండాలో, పాలనా విధానాల్లో ఏమైనా తేడాలున్నాయా? అధికారాన్ని తమ చుట్టూ, తమ కుటుంబాల చుట్టూ కేంద్రీకరించటం, ప్రజలు సొంతంగా

## ఇప్పుడు గాంధీ ఉంటే పాదయాత్రలు చేసేవారా?




నిజానికి స్వతంత్ర పోరాటంలో అప్పటికే నిర్మితమైన ఒక ప్లాట్‌ఫాం మీదికి దక్షిణాఫ్రికా నుంచి నేరుగా వచ్చినా కూడా 1916 నుంచి 1947 వరకు గాంధీజీ చేసింది నాలుగైదు పెద్ద ఉద్యమాలే. అయితే నిరంతరం ప్రజలలో ఉండటానికి తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండే ప్రచార పద్ధతుల్ని అనుసరించేవారు. రైళ్లను, పత్రికలను సమర్థ వంతంగా వినియోగించుకునేవారు. ఇప్పుడు సోషల్ మీడియా, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమాచారం అందించే మొబైల్ ఫోన్లు అందుబాటులోకి వచ్చిన తరుణంలో గాంధీ ఉంటే పాదయాత్రలు చేసేవారా? అనేది అనుమానమే. ఎంత సాంకేతికత ఉన్నా ఇంకా మనదేశంలో ఉన్న పరిస్థితుల్లో ప్రత్యక్షంగా ప్రజల్లోకి వెళ్లటం కూడా అవసరం కాబట్టి ప్రచారయాత్రల్ని ఇంకా స్వాగతించాల్సిందేగానీ సుదీర్ఘ పాదయాత్రలపై మాత్రం పునరాలోచన అవసరం.

ఆలోచించకుండా, ఎదిగే అవకాశాలు లేకుండా చేసే మాదక ద్రవ్యాలాంటి తాయిలాలివ్వటమేగా ఇద్దరి రాజకీయం!

జగన్ చెప్పిన నవరత్నాలే ప్రధాన ఎన్నికల మేనిఫెస్టో అనుకుంటే, అవి చాలామేర తెలుగుదేశం ఉచితాలకు పొడిగింపులే తప్ప భిన్నమైనవి కావు. ప్రత్యేకహోదాపై ఇప్పటికే వైకాపా గొంతు తగ్గించింది. ఎంపీల రాజీనామాపై మాటమార్చింది. ఇవన్నీ తెలుగుదేశం అనుసరిస్తున్న ఏరుదాటాక తెప్పతగలేసే రాజకీయాలే! కేసులున్న జగన్ ముఖ్యమంత్రి అయితే.. ఓటుకు కోట్లు వంటి కేసులతో నరేంద్రమోదీ ముందు తలవంచిన చంద్రబాబు కంటే బలహీనంగా కేంద్రంతో వ్యవహరిస్తారని అంచనా. వచ్చే ఎన్నికల్లో కూడా కేంద్రంలో మోదీ ప్రభుత్వమే అధికారంలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తుండటంతో, జగన్‌ను ఎన్నుకోవటం ఓ కీలుబమ్మ ముఖ్య మంత్రిని ఎన్నుకోవటమే అవుతుందన్న వాదనల్ని తోసిపుచ్చలేం.

తెదేపా పాలన చాలా పేలవంగా, అవినీతిమయంగా ఉందనటంలో సందేహం లేదు. కానీ అదే తరహా ఎజెండా, వ్యవహారశైలితో వస్తున్న వైకాపాను ఎంచుకోవటం వల్ల ప్రజలకు ఒరిగేదేమిటి? ఉదాహరణకు, రైతులకు ఎకరాకు రూ. 12,500 రాయితీనే తీసుకుందాం. రైతుకు లాభసాటి ధర వచ్చే విధానాలు లేకుండా, వారి పిల్లలకు ఉచితంగా మంచి చదువు, ఆరోగ్యం లేకుండా, లంచాలు లేకుండా పట్టాదారు పాసుపుస్తకం వంటివి తీసుకునే ఏర్పాటు లేకుండా వట్టి రాయితీ ఇస్తే వాళ్ల జీవితాలు ఏం బాగుపడతాయి? మరో రుణమాఫీ తరహాలో తయారవుతుంది. రుణ మాఫీ జరిగినా రైతులు అప్పుల ఊబి నుంచి బైటపడలేదు. ఒక్క సీజన్‌లో వర్షాలు పడకపోయినా, పంటకు డిమాండ్ 'తాత్కాలికంగా' తగ్గినా చిగురుటాకుల్లా వణికిపోతున్నారు.

ఇక విద్య, ఆరోగ్యం వంటివి కేవలం నిధులతోనో, హామీలతోనో ముడిపడిన అంశాలు కూడా కాదు. చాలా లోతైన విశ్లేషణతో తేలిగ్గా ఆచరించగలిగేలా విధానాలను రూపొందించగలగాలి. ఈ విధానాలన్నిటిలో చంద్రబాబు ప్రభుత్వం ఫెయిల్యూర్. ఏటా ఒక్కో ప్రభుత్వ/ఎయిడెడ్ పాఠశాల విద్యార్థి మీద ప్రభుత్వం రూ. 40,000-50,000 ఖర్చు పెడుతున్నా చిన్న లెక్కను చేసే, సొంతంగా ఆలోచించే సామర్థ్యం కూడా లేని పిల్లలే ఎక్కువగా ఉన్నారు. ఆరోగ్య పథకాలు జబ్బుల్నీ, అప్పుల్నీ ఆపలేకపోతున్నాయి. వీటికి జగన్ ఎజెండాలో కూడా చోటు లేదు.

అలాగే ఆచరణ సాధ్యంకాని, మాఫియాను పెంచే మద్యనిషేధ విధానాన్ని జగన్ ప్రకటించారు. గతంలో ఏపీలో మద్యనిషేధం అమలులో ఉన్న కాలంలో పలువురు ఎమ్మెల్యేలు చట్టవిరుద్ధ కార్యకలాపాలతో పదుల కోట్లు సంపాదించుకున్నారని మర్చిపోకూడదు. చంద్రబాబు ప్రభుత్వం అమలుచేస్తున్న విచ్చలవిడి మద్యం విధానం వల్ల పేదలు, రైతులు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా తీవ్రంగా దెబ్బతింటుండగా, మహిళలు, పిల్లలు కుటుంబహింస బారిన పడుతున్నారనటంలో సందేహం లేదు. దీనికి ప్రత్యామ్నాయంగా మద్యనిషేధం కన్నా.. ఆచరణసాధ్యమైన మద్య నియంత్రణ విధానాన్ని జగన్ పార్టీ ప్రకటించి ఉంటే విశ్వసనీయంగా ఉండేది.

అన్నట్టు, సానుభూతి గురించి ఇక్కడే ఓ విషయాన్ని గుర్తుచేసుకోవాలి. 2014లో చంద్రబాబు పాదయాత్ర చేసినప్పుడే జగన్ సోదరి వైఎస్ షర్మిల కూడా చేశారు. చంద్రబాబు కంటే దీటుగా ఆమె పాదయాత్ర చేశారు. కానీ ఆమె ఎందుకు నాయకురాలు కాలేకపోయారు? రాజకీయాలలో ప్రత్యక్ష పాత్రను పోషించే ఉద్దేశం లేనప్పుడు ఆమె ఎందుకు అంత కష్టపడ్డారు? అలా సమాజం కోసం స్వచ్ఛందంగా కష్టపడిన దాఖలాలేవైనా ఆమె గతంలో ఉన్నాయా?.. దీనివెనక రాజకీయాన్ని, వివక్షను కూడా ప్రజలు అర్థం చేసుకోవాలి.

ఏతావాతా, చంద్రబాబుకు ప్రత్యామ్నాయంగా జగన్ ఎలాంటి విధానాలను చెబుతున్నారు అని ఆలోచించకుండా కేవలం పాదయాత్రను చూసి సానుకూలంగా స్పందించటం

ప్రజలకు మేలు చేయదు. నేతలు పడ్డ శారీరక కష్టాన్ని గుర్తించాల్సిందే. కానీ అంతకంటే ముందు హేతుబద్ధ, విశ్వసనీయ విధానాలు, నిజాయతీ నాయకత్వం కావాలి. విధానాల పరీక్ష పాసయ్యాకే మిగిలిన విషయాలను పట్టించుకోవాలి.

అలాగే పవన్ కళ్యాణ్ వచ్చినా వ్యవహరించాలి. హాయిగా ఏసీలో కూర్చోవలసిన వ్యక్తి వచ్చి తిరుగుతున్నాడు అని సానుభూతిని చూపకుండా.. ఎజెండాను, చిత్తశుద్ధిని, నాయకత్వ సామర్థ్యాన్ని బట్టి మాత్రమే ఓటు వేయాలి.

ఇక లోక్‌సత్తా జేపీది పాదయాత్ర కాదు, ప్రచారయాత్ర. ఇది పార్టీల కతీతంగా జరుగుతున్నది. ఆయన ఒకరకంగా ఇప్పుడున్న ప్రాచుర్య పార్టీలకు ప్రత్యామ్నాయ పార్టీలా కాకుండా, ఓ ప్రత్యామ్నాయ రాజకీయంలా ప్రజల ముందుకొస్తున్నారు.

విశాఖపట్నంలో స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి పార్లమెంట్ సభ్యుడు కందాళ సుబ్రమణ్య తిలక్ 97వ జన్మదినోత్సవంలో పాల్గొన్నప్పుడు జేపీ తన 100 రోజుల జనచైతన్య యాత్రల గురించి ప్రకటించారు. మార్పు కోరుకుంటున్న కొందరు మిత్రులతో కలిసి తొలుత ఆంధ్రప్రదేశ్‌లో, ఆ తర్వాత తెలంగాణలో ఆయన ఈ ప్రచార యాత్రలు చేయాలనుకుంటున్నారు. విద్య, పేదరికం చాలా ఎక్కువగా ఉన్న రోజుల్లో కూడా ఓటుకు పైసా ఇవ్వకుండా, మద్యం పంచకుండా, కులం, మతం వంటి భావాల్ని రెచ్చగొట్టకుండా పోటీచేసిన 32 ఏళ్ల తిలక్‌ను పార్లమెంట్‌కు పంపిన తెలుగునాట ఈవేళ డబ్బు, ప్రజల్ని వేరు చేసే రాజకీయాలు ఎలా పెచ్చరిల్లి పోయాయో జేపీ ప్రస్తావించారు. మనం కడుతున్న పన్నుల డబ్బుతో నడుస్తున్న ప్రభుత్వాలు ఇంకా ఇంకా పన్నులు కట్టండి అని పిండుకుంటున్నాయి తప్ప.. కనీసం మంచి చదువు – ఆరోగ్యం, భద్రత, ఉపాధి, మౌలిక వసతులు, సరైన న్యాయం కూడా అందించటం లేదు. ఎక్కువమంది ప్రజలు ఆధారపడిన వ్యవసాయంలో న్యాయమైన ఆదాయం వచ్చేలా చేయటం లేదు. ఇంకోవైపు, సమర్థులు, నిజాయతీపరులు ఉన్నకొద్దీ రాజకీయాలకు దూరమవుతున్నారు. ఈ సమస్యలన్నిటినీ ప్రజలకు, ముఖ్యంగా యువత, రైతులు, మహిళలకు వివరించి పరిష్కారాలతో చైతన్య పరచాలని జేపీ సంకల్పం.

జేపీ యాత్రల వల్ల ఎన్నికలపరంగా ఎవరికి లాభం అనే అప్రజాస్వామిక ఊహాగానాలను పక్కనపెడితే, దీని వల్ల ముందు ప్రజలకు వాస్తవాలు మెరుగ్గా అర్థమవుతాయి. రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేకహోదా, రెవెన్యూలోటు భర్తీ వంటి ప్రతిపాదనల ద్వారా నూతన ఆంధ్రప్రదేశ్ ఆర్థిక భవిష్యత్తును పరిరక్షించేందుకు, యువతకు ఉపాధిని అందించేందుకు జేపీ కృషి చేశారు. ఆ తర్వాత ఓట్లు, సీట్లు లేకపోయినా అధికార, అభివృద్ధి వికేంద్రీకరణ, విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి మౌలికాంశాల మీద గళాన్ని వినిపిస్తూ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. జేపీ ప్రచార యాత్రల వల్ల వివిధ పార్టీల, నేతల విధానాలను బేరీజు వేసుకుని మెరుగైన విధానమేదో తేల్చుకునే అవకాశం ప్రజలకు లభిస్తుంది.

**ఓట్లు కూడా చారిటీ, సెంటిమెంట్ కోసం కాదు..**

మాదకద్రవ్యాల్లాంటి తాయిలాల పథకాల విషయంలో ఒకదానితో ఒకటి పోటీపడుతున్న సాంప్రదాయ పార్టీల హోరులో ప్రజలకు ఒక స్పష్టత నిచ్చేందుకు, మత్తును చిత్తు చేసే ఆలోచనను పెంచేందుకు, తలెత్తుకు బతికే జీవితం గురించి ధైర్యంగా ఆలోచించేందుకు జేపీ జనచైతన్యయాత్ర ఎంతగానో దోహదం చేస్తుంది. తాను గెలవటానికి ఐడియాలిచ్చేందుకు జగన్ కోట్లు ఇచ్చి ప్రశాంత్ కిషోర్‌ను నియమించుకున్నారు. అలాగే చంద్రబాబు, కేసీఆర్ కూడా చాలా ఎక్కువ సమయాన్ని ఎన్నికల్లో గెలుపు వ్యూహాల మీదే వెచ్చిస్తున్నారు. పవన్ కూడా ఇందుకోసం సమయం కేటాయిస్తున్నారు. వామపక్షాల నేతలూ వారి ఎత్తుగడల మీద కసరత్తు చేస్తున్నారు. తెదేపా, వైకాపా రెండు పార్టీలనూ గుప్పెట్లో పెట్టుకున్న కేంద్ర నేతల కనుసన్నల్లో అధికార, అనధికార పొత్తుల చుట్టూ బీజేపీ ఎత్తుగడలు వేసుకుంటోంది. మరి ప్రజాస్వామ్యంలో ప్రభువులైన ప్రజలకూ సలహాలు, ఐడియాలు ఇచ్చేవారు కావాలి గదా! కచ్చితంగా ప్రజలకు అందరికంటే ఎక్కువ మెరుగైన, మేలుచేసే ఆచరణాత్మక ఐడియాలను జేపీ ఇవ్వగలరు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాం మాధవ్ ఇటీవల తమ శ్రేణులకు ఒక గట్టి సూచన చేశారు. 'పార్టీ రాజకీయాలు చారిటీకోసం కాదు.. సెంటిమెంట్‌లు లేకుండా నిర్దాక్షిణ్యంగా వ్యవహరించి గెలవాలి' అన్నారు. ప్రజలు కూడా మంచి ఐడియాలను తీసుకుని తమ జీవితాల్ని, బిడ్డల భవిష్యత్తును శాసించే ఓటు, భావప్రకటనా స్వేచ్ఛలను అంతే నిర్దాక్షిణ్యంగా తమ ప్రయోజనాలు, తమ గెలుపు కోసమే వినియోగించుకోవాలి.

రాజకీయమంటే ఉమ్మడి అవసరాలు! ఎంత డబ్బు ఉన్నా అంబానీలులాంటి వారు కూడా తమ ప్రయాణాలకు రోడ్లు వేసుకోలేరు. ప్రభుత్వం ఉండాలి. ఇలాంటి ఉమ్మడి అవసరాలు సరిగా ఉంటేనే, ప్రజల జీవితాలు మెరుగుపడతాయి. కాబట్టి తమ కోసమే, తమ స్వార్థం కోసమే ప్రజలు మంచి రాజకీయాన్ని నిర్మించుకోవాలి. ఈ యాత్రల తర్వాత ఎవరికి ఓటు వేయాలి అన్నది ఆ తర్వాత ప్రజల ఇష్టం. కానీ ఎన్నికలు చంద్రబాబు కోసమో, జగన్, కేసీఆర్, పవన్, జేపీ కోసమో కాదు, తమ కోసం, తమ బిడ్డల భవిష్యత్తు కోసమని ప్రజల్లో ప్రతి ఒక్కరూ గుర్తించాలి. యాత్రలు ఇప్పటిదాకా చాలా సందర్భాల్లో నేతలకు అధికార మాత్రలవుతూ వచ్చాయి. ఇప్పటికైనా ప్రజలకు తమ జీవితాల్ని మెరుగు పరచుకునే చర్చలకు అవకాశాలుగా మారాలి. ❍

# ఒకచోట అధికారులు, ఇంకోచోట నేతలు.. ఇద్దరూ అవినీతిపరులే




**మేం** సచ్ఛీలురం, మా ఉద్యోగుల్లో 90శాతం మంది అవినీతిపరులు కాదని ఎన్నికల మోడ్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెబుతున్నా, ప్రజాభిప్రాయం వేరుగా ఉంది. కొన్ని విభాగాల్లో అధికారులు, మరికొన్ని విభాగాల్లో నేతలు.. మొత్తమ్మీద ఎమ్మెల్యే కేంద్రంగా అవినీతిరాజ్యం యథేచ్ఛగా సాగుతోందని ప్రజలంటున్నారు. స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేస్తూ ప్రవేశపెట్టిన జన్మభూమి కమిటీల పేరుతో అధికార పార్టీ వారు సాగిస్తున్న అవినీతి భాగోతానికి అంతులేకుండా పోయింది. ఇటీవల ప్రభుత్వం అమరావతిలో ఏర్పాటు చేసిన పరిష్కారవేదిక ద్వారా చేపట్టిన వీక్లీ ఫోన్ సర్వేలో కూడా ఇదే అభిప్రాయం వ్యక్తమైంది. పురపాలకశాఖలో భవన నిర్మాణ అనుమతుల కోసం తీసుకుంటున్న లంచాల్లో అధికారులు




కీలక పాత్రధారులని 74శాతం ప్రజలు చెప్పారు. విశాఖపట్నం జిల్లాలోని భూకబ్జాలు రాజకీయ నాయకుల వల్లేనని స్థానికుల్లో 76శాతం మంది అన్నారు. భూ రిజిస్ట్రేషన్లలో చట్టపరమైన మార్పులు తేవాలని 35శాతం మంది కోరారు. వీటన్నిటి సారాంశం– అవినీతి వ్యవస్థీకృతం, అవినీతి నిరోధం మాత్రం నామమాత్రం!.. ఇప్పటికైనా లోక్‌సత్తా చెబుతున్న 'పౌర సేవల' చట్టాన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అమలుచేసి ప్రజలకు నిర్ణీత గడువులోగా లంచాలు లేకుండా సేవలందించేందుకు చర్యలు తీసుకుంటారా? స్థానిక ప్రభుత్వాలను, అవినీతి నిరోధక చట్టాన్ని బలోపేతం చేస్తారా? లేక ఇంకా వాయిదా వేస్తూ ప్రజలను నష్టపరుస్తారా?.. చంద్రబాబు ప్రభుత్వం తేల్చుకోవాలి.

# అవినీతిపై డ్రామాలొద్దు, చేతలు చూపండి

**అ**వినీతిపై ఫిర్యాదు చేయండంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన టోల్‌ఫ్రీ నెంబర్‌కి మూడు రోజుల్లోనే 14,000కిపైగా ఫిర్యాదులు వచ్చాయని, రాష్ట్రంలో విచ్చలవిడి అవినీతికి ఇదే నిదర్శనమని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఇదేరకంగా టోల్‌ఫ్రీ నెంబరిచ్చి ఆ ఫిర్యాదుల ఊసే ఇప్పుడు ఎత్తటం లేదని, అదే తరహాలో అవినీతిపై ఏదో చేస్తున్నట్టు నటిస్తూ ప్రచారం తెచ్చుకోవటానికే తప్ప అవినీతి నిర్మూలనకు పటిష్ట చర్యల మీద చంద్రబాబు దృష్టి పెట్టటం లేదన్నారు. ఎక్కడబడితే అక్కడ భూకబ్జాలకు పాల్పడుతున్న తెలుగుదేశం నేతలు, ప్రజాప్రతినిధులను, అధికారులను అదుపు చేయటం చేతగాని చంద్రబాబు.. అవినీతిపరులను ప్రజల మధ్యే శిక్షిస్తాను అని సినిమా డైలాగులు చెబుతున్నారని బాబ్జీ విజయనగరంలో మీడియాతో మాట్లాడుతూ అన్నారు. పక్క రాష్ట్రాల నుంచి మంచిని నేర్చుకోవాలి తప్ప ఇలాంటి డ్రామాలు, వంశపారంపర్య రాజకీయాలు వంటి తప్పుడు సంస్కృతులను కాదన్నారు. పనికిమాలిన కార్యక్రమాలు, సమీక్షలతో కాలం వృధా చేయకుండా.. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి నిర్మూలనకు తక్షణం పౌర సేవల చట్టాన్ని తీసుకురావాలని, ఉన్నతస్థాయి అవినీతిపై ప్రత్యేక కోర్టుల్ని, స్వతంత్ర ప్రాసిక్యూషన్‌ని ఏర్పాటు చేసి వేగంగా విచారణ జరిపించి దోషుల ఆస్తులన్నిటినీ జప్తు చేయాలని బాబ్జీ డిమాండ్ చేశారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు పోలుపర్తి అప్పారావు, కాళ్ల శ్రీను, భీంపల్లి భాస్కర్, ఆదీశ్వరరావు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# మహిళలపై వేధింపుల్లో ముందున్న తెలుగు రాష్ట్రాలు



***మూడేళ్లలో ఏపీలో నమోదైన కేసుల్లో ఇంకా 424 కేసుల్లో ఛార్జిషీట్లు కూడా దాఖలు చేయలేదు. 2014లో నమోదైన కేసులకు సంబంధించి ఇప్పటికీ 188 కేసులలో అభియోగపత్రాలు దాఖలు చేయలేదు. తెలంగాణలో షీ టీమ్‌లు, ఇతరత్రా భరోసా ఏర్పాట్లు ఉన్నా, ఏపీలో ఐ క్లిక్ యంత్రాల్ని, అభయం యాప్ వంటివి ప్రవేశపెట్టినా అవి విస్తృతంగా జనంలోకి వెళ్లకపోవటం, పోలీసు స్టేషన్లంటే ప్రజల్లో ఉన్న భయం, పోలీసుల నిర్వాకం, న్యాయవ్యవస్థ నత్తనడక వల్ల మౌనంగా వేధింపుల్ని భరిస్తున్న మహిళలే ఇంకా పెద్దసంఖ్యలో ఉన్నారు.***

మహిళలపై వేధింపులు అత్యధికంగా నమోదైన రాష్ట్రాలలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ దేశంలోనే టాప్ ఫైవ్‌లో ఉన్నాయి. తెలంగాణ రెండో స్థానంలో ఉండగా, ఏపీ నాలుగో స్థానంలో ఉంది. 2015తో పోలిస్తే 2016లో ఆంధ్రప్రదేశ్‌లో స్త్రీల పట్ల ఆగడాలు 15.97శాతం పెరిగాయి. రోడ్లపై వెంటపడటం, మాట్లాడేందుకు ప్రయత్నించటం, పక్క నుంచి వెళ్తూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేయటం వంటి ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇటీవలికాలంలో ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాలతో వేధింపులు బాగా పెరిగాయని కేంద్ర హోంశాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వాస్తవంగా ఈ సంఖ్య అధికంగా వున్నా, చాలామంది పరువు పోతుందని ఫిర్యాదుకు ముందుకు రావటం లేదు. ఎలాగోలా ఫిర్యాదు చేసి, నేరస్తులను గుర్తించినా కేసులు నిలబడటం

**2016లో మహిళలపై వేధింపుల కేసులు అత్యధికంగా నమోదైన మొదటి నాలుగు రాష్ట్రాలు**

| | | |
|---|---|---|
| మహారాష్ట్ర | – | 1587 |
| తెలంగాణ | – | 1096 |
| మధ్యప్రదేశ్ | – | 762 |
| ఆంధ్రప్రదేశ్ | – | 639 |

లేదు. 2014–16 మధ్య ఏపీలో మహిళల వేధింపులకు సంబంధించి 1,694 కేసులు నమోదయ్యాయి. అయితే ఈ మూడేళ్లలో కేవలం 30 కేసుల్లోనే శిక్షలు పడ్డాయి. మరీ సంచలనమైతే తప్ప దర్యాప్తుపై పోలీసులు పెద్దగా శ్రద్ధ చూపకపోవడం, చాలా సందర్భాలలో వేధింపులకు గురైన బాధితురాలు న్యాయస్థానాలలో సాక్ష్యం అందించటంలో

| గత మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో మహిళలపై వేధింపుల కేసులు- శిక్షలు | | |
|---|---|---|
| సంవత్సరం | కేసుల సంఖ్య | శిక్షలు పడ్డ కేసులు |
| 2014 | 504 | 1 |
| 2015 | 551 | 15 |
| 2016 | 639 | 14 |

ఇబ్బందులు పడటం ఈ శిక్షల శాతం తగ్గటానికి కారణమవుతున్నాయి. మూడేళ్లలో ఏపీలో నమోదైన కేసుల్లో ఇంకా 424 కేసుల్లో ఛార్జిషీట్లు కూడా దాఖలు చేయలేదు. 2014లో నమోదైన కేసులకు సంబంధించి ఇప్పటికీ 188 కేసులలో అభియోగపత్రాలు దాఖలు చేయలేదు. తెలంగాణలో షీ టీమ్‌లు, ఇతరత్రా భరోసా ఏర్పాట్లు ఉన్నా, ఏపీలో ఐ క్లిక్ యంత్రాల్ని, అభయం యాప్ వంటివి ప్రవేశపెట్టినా అవి విస్తృతంగా జనంలోకి వెళ్లకపోవటం, పోలీసు స్టేషన్లంటే ప్రజల్లో ఉన్న భయం, పోలీసుల నిర్వాకం, న్యాయవ్యవస్థ నత్తనడక వల్ల మౌనంగా వేధింపుల్ని భరిస్తున్న మహిళలే ఇంకా పెద్దసంఖ్యలో ఉన్నారు.

## ఏపీలో పెరుగుతున్న కొత్త నేరగాళ్లు

దేశంలో కొత్త నేరగాళ్లు పెరుగుతున్నారు. దేశంలో మిగతా ప్రాంతాల్లో కంటే ఆంధ్రప్రదేశ్‌లో ఈ నయా సంస్కృతి మరీ ఎక్కువగా విస్తరిస్తోంది. వ్యవస్థీకృత ముఠాల స్థానంలో కొత్తతరం నేరవృత్తిలో ప్రవేశించటం బాగా ప్రబలుతోంది. ఏపీలో 2014–16లో జరిగిన వివిధ నేరాలకు సంబంధించి అరెస్టయినవారి గణాంకాలను విశ్లేషిస్తే ఇది స్పష్టమవుతోంది. 2014లో అరెస్టయిన ప్రతి వందమందిలో 92.8శాతంమంది, 2015లో ప్రతి వందమందిలో 83.7శాతంమంది తొలిసారి నేరానికి పాల్పడ్డవారే ఉండటం తీవ్రతకు అద్దం పడుతోంది. శిక్షలు పడుతున్నకొద్దీ నేరాల్లో పాత నేరగాళ్ల ప్రమేయం క్రమంగా తగ్గుతుండగా, అంతకుమించిన స్థాయిలో కొత్త నేరగాళ్లు తెరపైకి వస్తుండటం పోలీసు, న్యాయ, పాలనా సంస్కరణల డిమాండ్‌ను పెంచుతోంది. వీరంతా తొలిసారి నేరం చేసినవారు కావడం, గత నేరచరిత్ర లేకపోవడం, వారికి సంబంధించిన వివరాలేవీ పోలీసుల వద్ద అందుబాటులో లేకపోవడంతో నేరాలను ఛేదించటం కూడా సవాలుగా మారుతోంది.

దేశవ్యాప్తంగా చూస్తే, వివిధ నేరాల్లో 36,36,596మంది అరెస్టుకాగా, వారిలో 33,40,440 మంది అంటే 91.9శాతం మంది తొలిసారి నేరానికి పాల్పడ్డవారే కావడం గమనార్హం. వ్యవస్థీకృత ముఠాలను అరికట్టినట్టే వీరిని అరికట్టేందుకు సాంకేతిక వ్యవస్థను సమకూర్చుకోవటం, నేర పరిశోధనను వేగవంతం చేయటం తక్షణావసరాలని పోలీసు అధికారులు అంటున్నారు.

**అత్యాచారాల్లో తెలుగు రాష్ట్రాల అగ్రస్థాయి**

అత్యాచారాల విషయంలోనూ తెలుగు రాష్ట్రాలు దేశంలోనే ముందువరసలో ఉన్నాయి. ఈ అఘాయిత్యానికి పాల్పడేవారిలో అత్యధికులు బాధితులకు తెలిసినవారే. మనుషుల అక్రమ రవాణా, ఆర్థిక నేరాలు, మోసాలు వంటి కేసుల్లోనూ తెలుగు రాష్ట్రాలు ముందున్నాయని 2015కి సంబంధించి 'జాతీయ నేరగణాంక సంస్థ' విడుదల చేసిన అంకెలు హెచ్చరిస్తున్నాయి.

## తొలిసారి నేరాల వెనక..

- విలాసాలు, జల్సాల కోసం కొందరు, అవసరాల కోసం ఇంకొందరు తొలిసారిగా దొంగతనాలకు దిగుతున్నారు.
- క్షణికావేశాలకు, చుట్టూ వున్న పరిస్థితుల ప్రభావానికి లోనై మరికొందరు మొదటిసారి నేరాలకు పాల్పడుతున్నారు.
- పోలీసులకు పట్టుబడనంతవరకూ ఎన్నిసార్లు నేరానికి పాల్పడినా కొత్త నేరగాళ్లుగానే పరిగణించటం కూడా తొలిసారి నేరాలకు పాల్పడ్డవారి సంఖ్య పెరగడానికి కారణంగా ఉంటోంది.
- తొలుత మెడలో గొలుసులు లాక్కెళ్లడం, దృష్టి మరల్చి దోపిడీలకు పాల్పడడం, వాహనాలు చోరీ చేయడం వంటి నేరాలతో ప్రారంభించి వీరు పెద్ద నేరాలకు పాల్పడుతున్నారని పోలీసులు చెబుతున్నారు.
- గత రెండేళ్ల గణాంకాలను పరిశీలిస్తే, రెండు లేదా మూడు సార్లు శిక్షలు పడినవారు తమ తప్పు తెలుసుకుని నేరాలకు దూరంగా ఉంటున్నారు. అయితే తొలిసారిగా నేరం చేసే వారిలో మాత్రం నేరానికి పాల్పడితే ఏమవుతుందిలే అన్న ధీమా ఈ ధోరణి పెరగడానికి ఒక కారణమవుతుంది.
- నేరానికి పాల్పడ్డవారు పోలీసులకు పట్టుబడకపోతే.. వారిని చూసి మరికొంతమంది కూడా అదే బాటలో పయనిస్తున్న పరిస్థితి.

# వైద్యం ఎలా అందుతోందమ్మా?

రాష్ట్రంలో విద్య, వైద్యాన్ని మెరుగుపరచటాన్ని ప్రభుత్వం ఒట్టి మాటల్ని కాకుండా గట్టి చేతల్ని చూపాలని లోక్‌సత్తా 2.0 ఉద్యమసంస్థ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కన్వీనర్ బండారు రామ్మోహనరావు అన్నారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించడంతోపాటు ప్రభుత్వాసుపత్రులపై నమ్మకం కలిగించేలా వసతుల్ని కూడా కల్పించాలన్నారు. లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీతో కలిసి ఆయన విజయనగరం జిల్లా శృంగవరపుకోట సామాజిక ఆసుపత్రిని సందర్శించారు. అక్కడ అందుతున్న వైద్యసేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం వార్డులన్నీ పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పాలకుల విధానాల వైఫల్యం వల్ల ప్రభుత్వ ఆసుపత్రులు అధ్వాన్నంగా తయారయ్యాయని, మితిమీరిన ఒత్తిడి మధ్య వీలైనంత ఎక్కువమందికి సేవలందించేందుకు వైద్యసిబ్బంది ప్రయత్నిస్తున్నా కూడా పేద, మధ్యతరగతికి సరైన వైద్యసేవలు అందటం లేదన్నారు. ప్రభుత్వం సమగ్ర ప్రజావైద్య విధానాన్ని ప్రవేశపెట్టి ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ముఖ్యమంత్రులు కూడా సర్కారీ దవాఖానాల్లోనే వైద్యం తీసుకునేలా చేస్తే పరిస్థితులు మెరుగుపడతాయన్నారు. వైద్యరంగానికి ఇంకొన్ని అదనపు నిధులను కేటాయించి విధానాలు మారిస్తే ప్రజలు తెరిపిన పడతారన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో వసతుల్ని ముఖ్యంగా ప్రాథమిక స్థాయిలో బలోపేతం చేయాలన్నారు. కేంద్ర ఆసుపత్రుల దాకా రాకుండా ఎక్కువ కేసుల పరిష్కారం దిగువస్థాయిలోనే ఉండాలన్నారు. తక్కువ బడ్జెట్‌తోనే అందరికీ



వైద్యాన్ని అందించే విధానాన్ని ఇప్పటికే లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రభుత్వానికి అందించారన్నారు. మెరుగైన వైద్యసేవలకుగాను వైద్యసిబ్బందికి-ప్రజలకు మధ్య ఉండాల్సిన పరస్పర విశ్వాసాన్ని పెంపొందించేలా మెడికల్ ప్రాక్టిషనర్ చట్టం నమూనాను కూడా ఏపీ వైద్య ఆరోగ్యశాఖ విజ్ఞప్తి మేరకు జేపీ తయారుచేసి ఇచ్చారన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు కాండ్రేగుల ప్రసాద్, రామలక్ష్మి, నాగార్జున, శ్రీదేవి, నారాయణమూర్తి, భాస్కర్ తదితరులు ఉన్నారు.

అధికార పార్టీ ఎమ్మెల్యేలు వారి వారి నియోజకవర్గాలలో పాఠశాలల పరిశీలన చేయాలని బాబ్జీ డిమాండ్ చేశారు. పాఠశాలల్లో మౌలిక వసతులకు రూ.4,000కోట్లు ఖర్చు చేశామని విద్యాశాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు చెబుతున్నారని, విజయనగరం జిల్లాలో ఏ స్కూలుకి ఏ మేరకు మౌలిక వసతులు కల్పించారో పరిశీలనకు సిద్ధమా అని ప్రశ్నించారు.

# సంక్షేమ హాస్టళ్లు అధ్వాన్నం

విజయనగరం జిల్లాలో సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ ఎంత అధ్వాన్నంగా ఉందో లోక్‌సత్తా పార్టీ తరపున బాబ్జీ ఇటీవల ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ ఒక్క జిల్లానే కాదు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చాలా వసతి గృహాలు అదే రీతిలో ఉన్నాయని, అవినీతి నిలయాలుగా మారాయని ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) తనిఖీలో తేలింది. హాజరుపట్టీలో ఉన్న విద్యార్థుల సంఖ్యకు, వసతిగృహంలో వాస్తవంగా ఉండే సంఖ్యకు ఏమాత్రం పొంతన ఉండటం లేదు. లెక్కల వివరాల నిర్వహణ దారుణంగా ఉంది. మరుగుదొడ్లు వినియోగానికి వీలుగా లేవు. పలుచోట్ల కాస్మొటిక్ ఛార్జీలూ సక్రమంగా చెల్లించడం లేదు. ఇంఛార్జిలు ప్రధాన కేంద్రంలో నివసించడం లేదు. గుంటూరు జిల్లా నిజాంపట్నంలోని బీసీ బాలికల వసతిగృహంలో రాత్రిపూట విద్యార్థులు, సిబ్బంది ఉండటం లేదు. హాస్టల్‌లో 132 మంది విద్యార్థులకుగాను తనిఖీ సమయంలో ఒక్కరూ లేరు. విజయనగరం జిల్లా ఎల్.కోట బాలుర గృహంలో మరుగుదొడ్లు, వసతిగృహ ప్రాంగణాన్ని విద్యార్థులే శుభ్రం చేస్తున్నారు. ఇక్కడ 115 మందికిగాను 69మందే ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలోని బాలికల వసతిగృహంలో స్టాక్ రిజిస్టర్‌కు, నిల్వ సరకుకు మధ్య వ్యత్యాసం ఉంది. ఈ హాస్టల్‌లో 200మంది విద్యార్థులకుగాను తనిఖీ సమయంలో 161 మందే ఉన్నారు. కృష్ణా జిల్లా జి.కొండూరు బీసీ వసతిగృహంలో వారంలో ఐదురోజులు గుడ్లు ఆహారంలో పెట్టటం లేదు. ఇదే జిల్లా నందిగామ బాలుర వసతిగృహం-1లో 67మంది విద్యార్థులు రెండు గదుల్లోనే సర్దుకుంటున్నారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస బీసీ బాలుర వసతిగృహం-2, అదే జిల్లా తోటవాడ బీసీ బాలుర వసతిగృహంలోనూ ఏసీబీ సీఐయూ విభాగం తనిఖీలు నిర్వహించింది. ❍


# విద్య, ఆరోగ్యంపై పెట్టుబడులు పెరగాలి, 7.5 శాతం వృద్ధి కష్టమే: ఆర్థికసర్వే పార్ట్-2

ప్రజాసంక్షేమానికి ఎంతో చేస్తున్నామని ప్రభుత్వం భావిస్తున్నా.. సమాజంలోని బలహీన వర్గాలు, పేదలు, మహిళల స్థితిగతులు ఇంకా మెరుగుపడని దృష్ట్యా సామాజిక, ఆర్థిక సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉందని 2016-17 ఆర్థికసర్వే స్పష్టం చేసింది. విజ్ఞానాధారిత సమాజం నిర్మాణంలో భాగంగా విద్య, ఆరోగ్యం రంగాలపై పెట్టుబడులు పెరగాలని సూచించింది. ఉద్యోగాల కల్పన తీరుతోపాటు అందుకు సంబంధించి సరైన డేటా కూడా అందుబాటులో లేకపోవటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసింది.

సామాజిక రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వ్యయ నిష్పత్తి జీడీపీలో 2011-12 నుంచి 2014-15 వరకు 6శాతం వద్దే నిలిచిపోయింది. అయితే, 2015-16, 2016-17లలో ఈ నిష్పత్తిలో మరో ఒక శాతం వృద్ధి నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ రంగంలో వ్యయం 7.4శాతంగా ఉంది అని సర్వే తెలిపింది. 2016 ప్రపంచ ఆకలి సూచీలో అభివృద్ధి చెందుతున్న 118 దేశాల్లో భారత్ ర్యాంకు 97. అదే ఏడాది మానవాభివృద్ధి సూచీలో మొత్తం 188 దేశాల్లో మన దేశ ర్యాంకు 131 అని పేర్కొంది. అవకాశాలను భారత్ అందుకోవాలంటే సంస్థాగత మార్పులు తేగల పాలసీలు రూపొందించాలని స్పష్టం చేసింది.

2016-17 ఆర్థిక సర్వే రెండో భాగాన్ని ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ ఈ సర్వేను రూపొందించారు.

సర్వే మొదటి భాగంలో అంచనా వేసినట్టుగా.. 2017-18 ఆర్థిక సంవత్సరంలో 7.5శాతం వృద్ధి రేటును సాధించటం కష్టమని ఈ సర్వే అభిప్రాయపడింది. ఆర్థిక కార్యకలాపాల్లో సర్వత్రా అలముకొన్న స్తబ్ధతే దీనికి కారణమని విశ్లేషించింది. ఆర్థిక వ్యవస్థకు మరిన్ని జవజీవాలు అందించాలంటే వడ్డీరేట్లలో మరిన్ని కోతలు అవసరమని అభిప్రాయపడింది. రూపాయి మారకపు విలువలో తీవ్ర ఒడిదుడుకులు, వ్యవసాయ రుణాల మాఫీ, విద్యుత్తు, టెలికాం తదితర రంగాల ఆస్తి-అప్పుల పట్టీలపై పెరుగుతున్న ఒత్తిడి, వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమలులో ఉత్పన్నమవుతున్న సమస్యలు సవాలుగా మారిన విషయాన్ని గుర్తుచేసింది. ఆర్థిక వ్యవస్థకు నూతన జవజీవాలు అందించటానికి విధానపరమైన అన్ని సాధన సంపత్తుల్నీ వినియోగించాల్సిన అవసరాన్ని వివరించింది. 2017-18లో ద్రవ్యలోటు జీడీపీలో 3.2శాతం ఉండొచ్చని విశ్లేషించింది.




### మహిళలపై పెరుగుతున్న నేరాలు

దేశంలో మహిళలు, బాలికలపై అత్యాచారాలు, అపహరణలు, దాడులు వంటి నేరాల సంఖ్య పెరిగిపోతోందని ఆర్థికసర్వే హెచ్చరించింది. వారిలో అభద్రత పెరిగిపోతోందని పేర్కొంది. మహిళా సాధికారత, వారికి స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించేందుకు న్యాయపరంగా మరిన్ని చర్యలు తీసుకోవాల్సి ఉందని అభిప్రాయపడింది. బాధితులకు సత్వరన్యాయం అందించే చర్యలు తీసుకోవాలంది. మహిళలకు ఆస్తి హక్కు కల్పించటం, వేధింపుల నుంచి విముక్తి, ప్రభుత్వ-ప్రైవేటు విభాగాల్లో వివక్ష లేకుండా చూడటం వంటివి అవసరమని పేర్కొంది. మహిళలపై జరుగుతున్న నేరాలు గౌరవప్రదంగా జీవించే వారి హక్కును హరించి వేస్తున్నాయని వ్యాఖ్యానించింది.

### రుణమాఫీలు అనర్థదాయకమే

వ్యవసాయ రుణాల మాఫీతో ఆర్థికవ్యవస్థకు కలిగే నష్టాల్ని సర్వే ప్రముఖంగా ప్రస్తావించింది. 'నిజానికి రుణమాఫీ వల్ల ధరలు పెరగాలి. కానీ స్వల్పకాల పరిణామాల్ని చూసినట్టయితే ధరలు ఘోరంగా పడిపోయేటట్టు ఉన్నాయి. ఈ రుణమాఫీ

**పాలసీలను రూపొందించాలి - ఎగుమతుల్ని పెంచుకోవాలి**

దేశ ఆర్థిక వ్యవస్థలో స్తబ్దత నెలకొందని, దీనిని తిరిగి పరుగులు తీయించడానికి విధాననిర్ణేతలు తగిన పాలసీలను రూపొందించాలని అరవింద్ సుబ్రమణియన్ అభిప్రాయపడ్డారు. గత ఐదేళ్లలో అంతర్జాతీయ ఎగుమతుల్లో భారత్ వాటా 1.7శాతం వద్దే నిలిచిపోయిందని, ఎగుమతుల్ని పెంచుకోవటం ద్వారా ఆర్థిక స్తబ్ధతను కొంతవరకు అధిగమించే అవకాశముందని అన్నారు.

జాడ్యం ఇతర రాష్ట్రాలకూ పాకే అవకాశం ఉంది" అని సర్వే హెచ్చరించింది. రుణమాఫీ విషయంలో ఉత్తరప్రదేశ్ అడుగుజాడల్లో ఇతర రాష్ట్రాలూ నడిచినట్టయితే దేశవ్యాప్తంగా ఆ మొత్తం రూ.2.7లక్షల కోట్లకు చేరుకోవచ్చునని అంచనా వేసింది. వివిధ రాష్ట్రాలు ఇప్పటికే ప్రకటించిన రుణమాఫీ మొత్తం రూ.1.25లక్షల కోట్లన్న విషయాన్ని గుర్తుచేసింది. రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలు కుంగుతున్న దశలో రుణమాఫీ డిమాండ్లు వెల్లువెత్తుతుండటం ప్రమాదకరమంది. రుణమాఫీలకు కేంద్రం బాధ్యత తీసుకోదు కాబట్టి.. రాష్ట్రాలు సొంతంగా ఈ భారాన్ని భరించినట్టయితే, సగటు డిమాండ్ జీడీపీలో 0.7శాతం మేర తగ్గుతుందని అంచనా వేసింది. ఆ మొత్తం రూ.1.14 లక్షల కోట్లు ఉండొచ్చని అంచనా వేసింది. ఉత్తర ప్రదేశ్‌లో రూ.లక్ష వంతున, పంజాబ్‌లో రూ.2లక్షల వంతున, కర్ణాటకలో రూ.50వేల వంతున రైతులకు రుణమాఫీ చేసిన విషయాన్ని సర్వే ప్రస్తావించింది. వ్యవసాయ రాబడులు తగ్గిపోవడం, తృణధాన్యేతరాల ధరలు పడిపోవడం, పంటలకు తగిన గిట్టుబాటు ధరలు లభించకపోవడం లాంటివి వ్యవసాయ రంగంలో సంక్షోభానికి కారణాలని విశ్లేషించింది. పంటలకు తగిన గిట్టుబాటు ధరలు కల్పించడంలో ఎదురవుతున్న అన్ని సమస్యల్నీ పరిష్కరించాల్సి ఉందని సర్వే గట్టిగా పేర్కొంది.

**వ్యవసాయ ఆదాయాల పెంపు మీద దృష్టి పెట్టాలి**

విత్తనాలు వేయడానికి ముందుగానే.. జన్యుమార్పిడి పంటల్ని స్వీకరించడం, మార్కెటింగ్ నిర్ణయాలు తీసుకోవడం చేయాలని ఆర్థికసర్వే-2 స్పష్టం చేసింది. వ్యవసాయ రుణాల పంపిణీలో ప్రాంతీయ అసమానతల్ని తొలగించాలని సూచించింది. చిన్న, సన్నకారు రైతులకు అందుబాటు వడ్డీరేట్లలో సంస్థాగత రుణాల్ని సకాలంలో అందివ్వాల్సిన అవసరాన్ని చెప్పింది. మాగాణిని పెంచటం, మార్కెటింగ్ మౌలిక సదుపాయాల్ని మెరుగుపరచడం, పాడిరంగంలో ఉన్న మహిళలకు నిధులు అందుబాటులో ఉంచడంపై దృష్టి పెట్టాలంది. ఉత్పాదకత, మార్కెటింగ్, ధరల సంబంధ సమస్యల వల్ల వ్యవసాయ రంగంలో ఆదాయాలు అస్థిరంగా మారాయని, ఈ సమస్యల్ని పరిష్కరించడానికి తగిన విధానపరమైన నిర్ణయాల్ని ముందుగానే తీసుకోవాలని ఉద్ఘాటించింది. ఇదే జరిగితే 2017లో వ్యవసాయ ఉత్పత్తుల్లో మిగులు ఏర్పడుతుందంది. 2016లో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ ఆదాయాల పెంపుపై దృష్టి పెట్టాలంది. జన్యుమార్పిడి పంటలపై వివాదాల్ని పరిష్కరించాలని, సూక్ష్మసేద్యాన్ని ప్రోత్సహించాలని సూచించింది.

**ప్రజా రవాణా వాటా తగ్గిపోతోంది**

పర్యావరణ పరిరక్షణ, ఇంధన వ్యయం తగ్గింపులో ప్రజా రవాణాది కీలకపాత్ర అన్న సంగతి తెలిసిందే. కానీ ఇటీవల మనదేశంలో ద్విచక్ర, కారు, జీపు వంటి వాటా బాగా పెరుగుతుండగా ప్రజా రవాణా సాధనాలైన బస్సులు తదితర వాహనాల వాటా తగ్గిపోతోందని సర్వే వెల్లడించింది. 2017 మార్చి 31నాటికి దేశంలో 1.14 లక్షల కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారులు, 1.61 లక్షల కిలోమీటర్ల రాష్ట్ర రహదారులు, 52 లక్షల కిలోమీటర్ల పొడవైన ఇతర రహదారులు ఉన్నాయి. 2001లో దేశంలోని అన్ని రహదారుల పొడవు 33 లక్షల కిలోమీటర్లు కాగా, 5.50 కోట్ల వాహనాలు తిరుగుతున్నాయి. 2005కి దేశంలోని అన్ని రహదారుల పొడవు 54.72లక్షల కిలోమీటర్లకి చేరుకోగా, 21 కోట్ల వాహనాలు తిరుగుతున్నాయి.

**శుద్ధ ఇంధనాల వినియోగం పెరగాలి**

పర్యావరణానికి హాని చేకూర్చే ఉద్గారాల కట్టడికి భారత్ కట్టుబడి వ్యవహరిస్తోందని సర్వే తెలిపింది. కేంద్ర విద్యుత్ ప్రణాళిక (2016) ప్రకారం బొగ్గు ఆధారిత విద్యుదుత్పాదన కేంద్రాల సామర్థ్య వృద్ధి 2017-22లో దాదాపు 50 గిగావాట్లు ఉంటుంది. ఆ తర్వాత మరో అయిదేళ్ల వరకు థర్మల్ విద్యుదుత్పాదన స్థాపక సామర్థ్యంలో అదనంగా ఎలాంటి వృద్ధి ఉండదు. పెరిగే లోటును భర్తీ చేసేందుకు శుద్ధ ఇంధనాల వినియోగానికున్న అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సర్వే అభిప్రాయపడింది.

**మౌలిక వసతుల వృద్ధికి ఇంకా చాలా చేయాలి**

మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం బహుముఖ వ్యూహాలను అనుసరిస్తోందని సర్వే వివరించింది. రహదారుల


## వడ్డీ ఉచ్చులో తెలుగు రైతులు

వ్యవసాయ రుణాలకు వడ్డీ వ్యాపారుల మీద ఆధారపడటం తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువగా ఉందని ఆర్థికసర్వే-2 కూడా తెలిపింది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, కర్ణాటక, రాజస్థాన్‌లలో వ్యవసాయ రుణాలు అధికంగా ఉన్నట్టు వెల్లడించింది. జీఎస్‌డీపీతో పోలిస్తే మాత్రం.. అత్యధిక సాగు రుణాలున్న రాష్ట్రాల్లో పంజాబ్, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లు ఉన్నట్టు తెలిపింది.

- వ్యవసాయ రంగంలో అనధీకృత (ఇన్‌ఫార్మల్) రుణ కార్యకలాపాలు అత్యధికంగా ఆంధ్రప్రదేశ్, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, తెలంగాణల్లో ఉన్నాయి. ఈ నాలుగు రాష్ట్రాల్లో వీటి మొత్తం రూ.లక్ష కోట్ల వరకూ ఉంది. మొత్తం రైతుల అప్పుల్లో ఇది 56శాతం. ఈ ప్రభుత్వాలు రుణమాఫీ చేసినా ఇప్పటికీ రైతులు చాలా అప్పుల్లో ఉన్నారు.
- ఏపీలో చిన్న, సన్నకారు రైతులపై 2016-17 నాటికి రూ.44,599 కోట్ల రుణభారం ఉంది. ఇందులో వ్యవస్థీకృత రంగం నుంచి తీసుకున్నది రూ.18,727కోట్లు మాత్రమే. మధ్యతరగతి రైతులపై రూ.7,388కోట్లు, పెద్ద రైతులపై రూ.5,542కోట్లు భారం ఉంది. మొత్తంగా అన్ని వర్గాల రైతులపై రూ.57,529కోట్ల భారం ఉంది.
- తెలంగాణలో చిన్న, సన్నకారు రైతులపై రూ.27వేల కోట్ల రుణభారముంది. ఇందులో అనధీకృత రుణాలు రూ.17,925కోట్లు. మొత్తంగా అన్ని వర్గాల రైతులపై రూ.30,753కోట్ల రుణభారముంది. ఇందులో వ్యవస్థీకృతం రూ.10,620కోట్లు మాత్రమే.
- 2015-16లో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఒడిషా, ఛత్తీస్‌గఢ్‌లలో 6శాతం మేర ద్రవ్యోల్బణం నమోదైంది. 2016-17లో తెలంగాణలోనే 6శాతానికి మించి ద్రవ్యోల్బణం కనిపించింది.
- 2017-18లో తాజా ధరల ప్రకారం ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీ రూ.7.7లక్షల కోట్లు ఉంటుందని అంచనా. ఉదయ్ పథకాన్ని మినహాయిస్తే, ఆర్థికలోటు రూ.23,100కోట్లకు చేరనుంది. ఇది 14వ ఆర్థికసంఘం నిర్దేశించిన 3శాతం లోటుకు సమానం. రాష్ట్రానికి ఇక ఏమాత్రం అదనపు లోటును భరించే శక్తి లేదు.
- 2017-18లో తెలంగాణ జీఎస్‌డీపీ రూ.7.6లక్షల కోట్లకు చేరనుంది. ఉదయ్ పథకాన్ని మినహాయిస్తే ఆర్థిక లోటు రూ.26,100కోట్లు (3.5శాతం)కు చేరనుంది. ఇది 14వ ఆర్థికసంఘం చేసిన సిఫార్సుకు సమానం.
- ఆంధ్రప్రదేశ్ డిస్కంలపై 2015 సెప్టెంబర్ 30నాటికి రూ.14,721కోట్ల భారముండగా, తెలంగాణ డిస్కంలపై రూ.11,244కోట్ల భారముంది.
- పరిపాలనా లెక్కల ప్రకారం.. ఏపీలో 27.20శాతం (జనాభా లెక్కల ప్రకారం 33.36శాతం) పట్టణీకరణ జరిగింది. 5వేలకు పైగా జనాభా ఉన్న ప్రాంతాలు 57. 31శాతం ఉన్నాయి.
- 2016లో అత్యధికంగా దేశీయ పర్యాటకులు సందర్శించిన తొలి ఐదు రాష్ట్రాలు తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక.
- తాజా ధరల (2011-12 ప్రమాణాలు) ప్రకారం.. 2016-17లో ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీలో 13.8శాతం వృద్ధి నమోదైంది. తెలంగాణలో ఇది 13.7శాతంగా ఉంది. వృద్ధి రేటులో మధ్యప్రదేశ్ (18.2శాతం) తర్వాతి స్థానాల్లో తెలుగు రాష్ట్రాలున్నాయి.
- 2016-17లో తలసరి స్థూల ఉత్పత్తి వృద్ధిరేటు ఏపీలో 13.1శాతం, తెలంగాణలో 12.6శాతం నమోదయ్యాయి.

నిర్మాణం, అనుసంధానం, భారతమాల ప్రాజెక్టుల్లో పెట్టుబడుల పెంపునకు కృషితోపాటు జలమార్గాల అభివృద్ధి, రైల్వేలు, వైమానిక రవాణాల విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల రవాణా వసతుల్లో మనదేశం ప్రపంచబ్యాంకు ర్యాంకింగ్‌లో 2014లో ఉన్న 58వ స్థానం నుంచి 2016కి 36వ స్థానానికి చేరుకుంది. అయినా ఇంకా చాలా చేయాల్సి ఉందని పేర్కొంది. లాజిస్టిక్ పార్కులు, రింగు రోడ్డుల నిర్మాణం చేపట్టడంతోపాటు వివిధ ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యాన్ని తగ్గించాలని సూచించింది. 60 నగరాలను స్మార్ట్ సిటీలుగా మార్చేందుకు రూ.1,33,368 కోట్ల పెట్టుబడులను ప్రతిపాదించిన విషయాన్ని సర్వే గుర్తుచేసింది. ❍

# 2వ తరగతి పాఠం చదవలేకపోతున్న 8వ తరగతి విద్యార్థులు




రెండవ తరగతి పాఠాన్ని కూడా చదవడం రాని ఎనిమిదో తరగతి విద్యార్థులున్న విద్యావ్యవస్థ దేశంలో కొనసాగుతోందని ఆర్థికసర్వే-2 ఎత్తిచూపింది. ఉత్తరాది రాష్ట్రాలతోపాటు తెలుగు రాష్ట్రాల్లోనూ విద్యావ్యవస్థ ఎంత అధ్వాన్నంగా ఉందో తెలిపిన 'అసర్' (యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్)-2016ను నివేదికలో ఉటంకించింది. పాఠశాలలో విద్యార్థులు పాఠాలు ఎలా నేర్చుకుంటున్నారు? వారిలో పఠనా ప్రతిభ, లెక్కలు చేసే నైపుణ్యం ఎలా ఉన్నాయి అనే అంశాలను బేరీజు వేయడానికి ప్రథమ్ అనే సంస్థ ఈ సర్వేను గ్రామీణ భారత్‌లో నిర్వహించింది. దేశంలోని 589 జిల్లాల్లో 17,473 గ్రామాలకెళ్లి అక్కడ మూడేళ్ల నుంచి 16 ఏళ్లలోపు వయసుండి బడికెళుతున్న 5,62,305మంది విద్యార్థులతో చేసిన ఈ అధ్యయనాన్ని ఇటీవల విడుదల చేసింది.

ఉత్తరాది రాష్ట్రాలైన ఉత్తర ప్రదేశ్, బీహార్‌లాంటి చోట

| తెలంగాణ తెలుగు (గణాంకాలు శాతాల్లో) తరగతి | పదాలు | అక్షరం గుర్తించ లేనివారు | అక్షరం చదవ గలిగినవారు | 1వ తరగతి పాఠం | రెండవ తరగతి పాఠం చదివేవారు |
|---|---|---|---|---|---|
| 4 | 5.1 | 10.5 | 27.1 | 23.6 | 33.8 |
| 5 | 3.1 | 9.5 | 16.9 | 23.4 | 47.1 |
| 6 | 4.9 | 6.9 | 15.3 | 15.6 | 57.3 |
| 7 | 2.8 | 4.8 | 10.0 | 17.6 | 64.9 |
| 8 | 1.2 | 3.1 | 8.7 | 11.2 | 75.8 |
| **గణితం తరగతి** | **1-9 అంకెలు గుర్తించలేనివారు** | **అంకెలు గుర్తించినవారు** | **తీసివేతలు వచ్చినవారు** | **భాగాహారాలు తెలిసినవారు** | |
| 4 | 2.5 | 36.5 | 42.6 | 18.3 | |
| 5 | 2.2 | 29.3 | 38.1 | 30.4 | |
| 6 | 2.0 | 25.9 | 38.7 | 33.5 | |
| 7 | 1.5 | 19.4 | 37.1 | 42.0 | |
| 8 | 0.7 | 17.0 | 27.2 | 55.1 | |
| **ఇంగ్లిష్ తరగతి** | **అక్షరం గుర్తించలేనివారు** | **చిన్న అక్షరాలు** | **చిన్న పదాలు** | **సులభ వాక్యాలు చదివేవారు** | |
| 4 | 11.6 | 20.1 | 26.4 | 41.9 | |
| 5 | 10.5 | 22.1 | 23.2 | 44.1 | |
| 6 | 7.5 | 17.4 | 22.4 | 52.7 | |
| 7 | 6.4 | 13.7 | 22.0 | 57.9 | |
| 8 | 6.0 | 13.7 | 12.2 | 68.1 | |

ఆంధ్రప్రదేశ్

తెలుగు (గణాంకాలు శాతాల్లో)

| తరగతి | అక్షరం గుర్తించ లేనివారు | అక్షరం చదవ గలిగినవారు | పదాలు | 1వ తరగతి పాఠం | రెండవ తరగతి పాఠం చదివేవారు |
|---|---|---|---|---|---|
| 4 | 4.5 | 8.4 | 20.1 | 22.9 | 44.1 |
| 5 | 4.5 | 7.3 | 11.5 | 21.6 | 55.1 |
| 6 | 2.4 | 4.2 | 11.2 | 22.6 | 59.6 |
| 7 | 2.3 | 3.1 | 7.6 | 17.6 | 69.4 |
| 8 | 1.6 | 2.4 | 4.3 | 13.8 | 77.8 |

గణితం

| తరగతి | 1-9 అంకెలు గుర్తించలేనివారు | అంకెలు గుర్తించినవారు | తీసివేతలు వచ్చినవారు | భాగాహారాలు తెలిసినవారు |
|---|---|---|---|---|
| 4 | 1.4 | 32.2 | 41.1 | 24.4 |
| 5 | 2.7 | 28.4 | 31.7 | 37.2 |
| 6 | 1.7 | 21.8 | 34.1 | 42.5 |
| 7 | 1.4 | 23.8 | 33.5 | 41.5 |
| 8 | 1.0 | 17.3 | 31.3 | 50.4 |

ఇంగ్లిష్

| తరగతి | అక్షరాలు గుర్తించనివారు | చిన్న అక్షరాలు | చిన్న పదాలు | సులభ వాక్యాలు చదివేవారు |
|---|---|---|---|---|
| 4 | 11.6 | 20.6 | 27.5 | 40.3 |
| 5 | 8.6 | 15.3 | 28.8 | 47.3 |
| 6 | 8.8 | 12.5 | 21.3 | 57.5 |
| 7 | 6.4 | 12.6 | 21.0 | 60.0 |
| 8 | 3.8 | 9.4 | 15.5 | 71.3 |

విద్యార్థులు కనీస స్థాయిలో చదవలేని దృశ్యాలు కనిపించగా, తెలుగు రాష్ట్రాల్లో కనీసం తెలుగు అక్షరాలను గుర్తించలేని వారు ఎనిమిదో తరగతి విద్యార్థుల్లోనూ అధ్యయన బృందానికి కనిపించారు. ఆంధ్రప్రదేశ్‌లో 1.6, తెలంగాణలో 1.2 శాతం మంది విద్యార్థులు ఇలా ఉన్నారు. అయిదో తరగతిలో ఇలాంటివారు ఏపీలో 4.5, తెలంగాణలో 3.1శాతం ఉన్నారు. కొంతమంది అక్షరాలను గుర్తించగలిగినా కనీసం రెండక్షరాల పదాలను చదవలేకపోతున్నారు. ఎనిమిదో తరగతికి వచ్చినా కనీసం రెండవ తరగతి పాఠాన్ని కూడా చదవడం రాని విద్యార్థులు ఏపీలో 22.2, తెలంగాణలో 24.2శాతం కనిపించారు. మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, రాజస్తాన్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాల్లో 30శాతం మంది ఎనిమిదో తరగతి విద్యార్థులు రెండవ తరగతి పాఠం చదవలేకపోతున్నారు.

దేశంలోని విద్యార్థుల్లో వారి మాతృభాష చదువుల్లోనేకాదు ఆంగ్లంలోనూ ప్రతిభ ఏమంత ఆశాజనకంగా లేదని అసర్ పేర్కొంది. తెలుగు రాష్ట్రాల్లోని ఎనిమిదో తరగతి విద్యార్థులు చాలామంది ఇంగ్లిష్ పాఠంలోని వాక్యాలు చదవలేకపోతున్నారు. ఏపీలో 28.7, తెలంగాణలో 31.9శాతం మంది విద్యార్థులు ఇలా ఆంగ్ల పాఠం చదవలేకపోతున్నారు. ఏడో తరగతిలోనైతే ఇలాంటివారు రెండు రాష్ట్రాల్లోనూ 40శాతం పైగానే ఉన్నారు. ఇంగ్లిష్ అక్షరాలను సైతం గుర్తించలేని విద్యార్థులు పలు తరగతుల్లో పెద్దసంఖ్యలోనే కనిపించారు.

## లెక్కల్లో తడబాటు

లెక్కల్లోనూ విద్యార్థులు బాగా తడబడుతున్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో సగం మంది 'తీసివేత'లను దాటి భాగాహారాలు కూడా చేయలేని స్థితిలో ఉన్నారు. కేవలం 50.4శాతం మంది విద్యార్థులు మాత్రమే ఏపీలో భాగాహారాలు చేస్తున్నారు. 31.3శాతం మంది తీసివేతలు చేయగలుగుతున్నారు. తెలంగాణలో ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో 55.1శాతం మంది భాగాహారాలు దాటి గణిత సమస్యల్ని పరిష్కరించగలుగుతున్నారు. 27.2శాతం మంది తీసివేతలు చేయగలుగుతున్నారు. ఏడో తరగతి విద్యార్థుల్లో ఈ ప్రతిభ ఉన్నవారు మరింత తక్కువమంది కనిపించారు. రెండు రాష్ట్రాల్లోనూ ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో ఒకటి నుంచి 9లోపు అంకెలను కూడా గుర్తించలేనివారు ఒక శాతం ఉండటం విస్మయం కలిగిస్తుంది. ❍

# విద్యాసంస్థల ద్వారానైనా దళితులపై దాడులు కొంతమేర తగ్గుతాయని ఆశిద్దాం

**- మేళం భాగ్యారావు,**

జాతీయ ప్రధాన కార్యదర్శి, దళిత బహుజన ఫ్రంట్

స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు దాటినా దళితులపై అకృత్యాలు ఇంకా కొనసాగుతున్నాయి. మతం నుంచి పుట్టి పెరిగి వర్ధిల్లుతున్న కులం, అందులో నుండి విషపుత్రికగా అవతరించిన అంటరానితనాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. కుల వివక్షకు వ్యతిరేకంగా చట్టాలు వచ్చాయి, కొన్ని ఉపశమనాల్ని ఇచ్చారు గానీ.. దళితుల మౌలిక సమస్యను పరిష్కరించాలని ఏ సాంప్రదాయ రాజకీయ పార్టీ ప్రయత్నించటం లేదు. వారిని రాజకీయ ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయి. కుల సమాజాన్ని కొనసాగిస్తూ ప్రతి ఒక్కరినీ కులం కోణం నుంచి చూడటమే జరుగుతోంది.


మన కుల వ్యవస్థలో అసమానతలు, ఆధిపత్యాలు, అవమానాలు భరించినంతకాలం బాధలేవీ కనిపించవు. వీటిపై ధిక్కారస్వరం వినిపించినపుడే అత్యాచారాలు, దాడులు, బహిష్కరణలు, ఏరివేతలు సంభవిస్తున్నాయి. అంటరాని కులాలుగా ఊరికి దూరంగా వెలివేయబడిన దళితులది నేడు ధిక్కార స్వరూపంగా మారింది కాబట్టే తట్టుకోలేని ఆధిపత్య కులాలు, పాలక కులాలు దళితులపై దాడులు, దమనకాండలకు దిగుతున్నాయి. మనిషిని మనిషిగా చూడాలన్న మన రాజ్యాంగ లక్ష్యం.. ఆపై కులతత్వం స్థానంలో మానవత్వాన్ని నింపాలని పోరాడిన మహనీయుడు అంబేద్కర్ ఆశయాల వెలుగులో ఈ నవీనకాలంలో దళితులు ఆత్మగౌరవం కోసం దాడులు, అవమానాలకు వ్యతిరేకంగా పోరాడుతూనే ఉన్నారు. డాక్టర్ అంబేద్కర్ ప్రారంభించిన ఆత్మగౌరవ పోరాటం ఈ తెలుగుగడ్డపై సైతం 1985 కారంచేడు దాడిలో నుంచి ఉవ్వెత్తున పుట్టుకొచ్చింది. ఆ తర్వాత చుండూరు మారణకాండకు వ్యతిరేకంగా దళిత మానవ హక్కుల జాతీయ, అంతర్జాతీయ పోరాటంగా రూపుదిద్దుకుంది. అనంతరం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రాంతాల్లో దళితులపై కొనసాగిన దాడులపై దళిత నాయకత్వంలో అనేక పోరాటాలు విజృంభించాయి. ఈ నేపథ్యంలో దళితుల రక్షణ కొరకు అనేక ప్రత్యేక రక్షణ చట్టాలు, ప్రత్యేక పథకాలు పుట్టుకొచ్చాయి. అయినా ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదు. వివిధ కార్యక్రమాలకు కోట్లాది రూపాయల వ్యయంతో ప్రచారం చేసే ప్రభుత్వాలు అంటరానితనం, అత్యాచారాలకు వ్యతిరేకంగా చైతన్యం తెచ్చే ప్రయత్నాలు చేయటం లేదు. ముఖ్యంగా ప్రత్యేక కాలనీలు, దళితవాడలను తొలగించి గ్రామాల్లో సహజీవనం కల్పించే వివిధ పథకాలతో విద్యాసంస్థల ఏర్పాటు ద్వారా కొంతమేర అయినా దళితులపై దాడులు తగ్గుతాయని ఆశిద్దాం.

# అలాంటి వాళ్లు ఉన్నత పదవుల్లో ఉండటం దౌర్భాగ్యకరం

## దళితులపై మంత్రి వ్యాఖ్యలను ఖండించిన జేపీ

ఆంధ్రప్రదేశ్ మంత్రి సీహెచ్ ఆదినారాయణరెడ్డి కడప జిల్లా జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రిలో దళితులపై స్వాతంత్ర్య దినోత్సవంనాడు చేసిన వ్యాఖ్యలను లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తీవ్రంగా ఖండించారు. "దళితులకు రిజర్వేషన్లు పొడిగించినా ఫలితం లేదు, వాళ్లు శుభ్రంగా ఉండరు, సక్రమంగా చదువుకోరు, దళితులు అభివృద్ధి చెందకపోవడానికి దళితులే కారణం" అని మంత్రి చేసిన వ్యాఖ్యలు ఆధునిక సమాజానికి, రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి అవమానకరమన్నారు. దళితుల, ఇతర అణగారిన, పేద వర్గాల దుస్థితికి సమాజ వివక్ష, పాలకుల పాపం తప్ప ప్రకృతి శాపం కారణం కాదని జేపీ అన్నారు. ప్రకృతి అందరికీ ఒకేరకంగా తెలివితేటల్ని, ఆలోచనాశక్తిని, గుణాన్ని ఇచ్చిందన్నారు. వాటిని వికసింప చేసే మంచి విద్యను, వైద్యాన్ని అందించకుండా దళితుల్ని దగా చేసింది పాలకులేనన్నారు. ఒక కులంలో పుడితే గొప్ప, ఇంకో కులంలో పుడితే తక్కువ అని నమ్మేవాళ్లు 2017లో కూడా ఉన్నత పదవుల్లోకి చేరటం, జాతి భవితవ్యాన్ని నిర్ణయించే స్థాయిలో ఉండటం దౌర్భాగ్యకరమని జేపీ అన్నారు. ❍

# అన్సారీ గణాంక హెచ్చరికలు



భారత నూతన ఉప రాష్ట్రపతిగా వెంకయ్య నాయుడు ప్రమాణస్వీకారం చేస్తున్న తరుణంలోనే పదవీ విరమణ చేస్తున్న ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ చేసిన కొన్ని వ్యాఖ్యలపై అవాంఛనీయ విమర్శలు వెలువడ్డాయి. మోదీ ప్రభుత్వం పట్ల ఇంకా సానుకూలంగా ఉన్న ఉదార ప్రజాస్వామ్యవాదులను కూడా అన్సారీపై విమర్శలు బాధించాయి. ఉప రాష్ట్రపతి హోదాను అలా వుంచితే, అన్సారీ దేశ హితానికి దోహదం చేసే ప్రయత్నాల్ని ప్రోత్సహించే సానుకూల మేధావులలో ఒకరు. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ సంస్కరణల ప్రతిపాదనల్ని ఎంతో ఆసక్తిగా వింటూ వీలైనంత ప్రోత్సాహాన్ని అందిస్తుండేవారు. ఉప రాష్ట్రపతిగా పదవీ విరమణ చేయడానికి కొన్ని నెలల ముందు భారత న్యాయవాదుల సంఘం జాతీయ సదస్సులో అన్సారీ చేసిన ప్రసంగం ఢిల్లీ నుంచి గల్లీ దాకా ప్రతి ప్రజాప్రతినిధికీ, ప్రతి పౌరునికీ దిశానిర్దేశం చేసేటువంటిది. దేశం ఎదుర్కొంటున్న కీలక సవాళ్లను ఆయన గణాంకసహితంగా వివరించారు. వెంకయ్యా జీ! మీకు తెలియనివి కాకపోయినా, ఉప రాష్ట్రపతిగా మీ కార్యక్రమాల్ని ఫ్రేమ్ చేసుకునేముందు ఒక్కసారి మీరు కూడా అన్సారీ ప్రసంగంలో పేర్కొన్న ఈ గణాంకాల్ని ప్రాధాన్యాంశాలుగా గమనంలోకి తీసుకోండి..

- దేశ సంపదలో 45శాతాన్ని కోటీశ్వరులు నియంత్రిస్తున్నారు
- ఆర్థిక అసమానతలున్న ప్రపంచదేశాల్లో మనది పన్నెండో స్థానం (వరల్డ్ వెల్త్ సంస్థ అధ్యయనం ఆధారంగా)
- దేశ మొత్తం సంపదలో దాదాపు సగభాగం కేవలం ఒక్క శాతం ప్రజలైన మహా కుబేరుల చేతిలో ఉంది. అందులో 10శాతం మంది 74శాతం సంపదను అనుభవిస్తున్నారు (క్రెడిట్ సుసె సంస్థ నివేదిక ప్రకారం).
- నిరుపేదలైన 30శాతం మందికి మొత్తం సంపదలో 1.4శాతం మాత్రమే మిగిలింది
- సామాజిక, ఆర్థిక మార్పులు వస్తున్నా కులాధిపత్యం, కులవిభేదాలు కొనసాగుతున్నాయి
- ప్రతి 18 నిముషాలకో దళితునిపై దౌర్జన్యం జరుగుతోంది (జాతీయ మానవ హక్కుల సంఘం -2010 నివేదిక ప్రకారం)
- దళితుల్లో 37శాతం దారిద్ర్యరేఖకు దిగువన, 54శాతం పౌష్టికాహార లోపంతో అలమటిస్తున్నారు (జాతీయ మానవ హక్కుల సంఘం - 2012 నివేదిక)
- ప్రతి వేయి మంది పిల్లల్లో 83మంది ఏడాదిలోపే కన్నుమూస్తున్నారు
- 45శాతం మంది నిరక్షరాస్యులుగా మిగిలిపోతున్నారు
- 28శాతం గ్రామాల్లో దళితుల్ని పోలీసు ఠాణాల్లోకి అడుగుపెట్టకుండా నియంత్రిస్తున్నారు
- 39శాతం ప్రభుత్వ పాఠశాలల్లో దళిత విద్యార్థుల్ని వేరేగా కూర్చోబెడుతున్నారు
- 24శాతం దళిత కుటుంబాలకు బంట్రోతులు తపాలా సేవలను అందించటం లేదు
- మానవాభివృద్ధిలో మనదేశానిది 188వ స్థానం ❍

## 'ట్రిపుల్ తలాక్‌పై తీర్పు' మానవ హక్కులకు, మహిళా స్వేచ్ఛకు పెద్ద విజయం: జేపీ

ముమ్మారు తలాక్ అనే ఇస్లాం మతాచారం చెల్లదని, షరియా చట్టాలను పరిగణలోకి తీసుకుంటూ దీనిపై పార్లమెంట్‌లో చట్టం తీసుకురావాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు "మానవ హక్కులు, మహిళా స్వేచ్ఛ, హేతుబద్ధ భావాలకు" లభించిన పెద్ద విజయమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ హర్షం వ్యక్తం చేశారు.


"గుడ్డి విశ్వాసాలు, మూర్ఖపు ఆచారాలపై మానవ హక్కులు గెలిచాయి. మనుషుల్ని బానిసలుగా మార్చేది విశ్వాసం కాదు" అని జేపీ అన్నారు. హిందూయిజంలోని కులం కావచ్చు, ఇస్లాంలోని మహిళలకు విడాకులిచ్చే తలాక్ కావచ్చు.. మతం పేరున్నంత మాత్రాన అమానుష విశ్వాసాలు ఆమోదయోగ్యం కావన్నారు. అజ్ఞానాంధకారాన్ని వ్యాప్తి చేసే అలాంటి అన్నిరకాల ధోరణులపై హేతుబద్ధత, మానవ హక్కులు, స్వేచ్ఛ, ఆధునికతలదే పైచేయి కావాలన్నారు. మధ్యయుగ అవశేషాలుగా సమాజాన్ని పీడిస్తున్న ఛాందస, ఆధిపత్య సాంప్రదాయాలన్నిటినీ నిర్మూలించాలని, ఎడారుల్లాంటి ఆచారాల్లో చిక్కుకుని ప్రజల హేతుబద్ధ ఆలోచనాశక్తి దారితప్పకూడదని జయప్రకాష్ నారాయణ్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

www.twitter.com/jp_loksatta, www.facebook.com/jploksatta ❍

# నవ భారత్: స్వప్నం, సత్యం!

- రాజ్‌దీప్ సర్దేశాయి, సీనియర్ జర్నలిస్టు

గొప్ప సందేశకులే గొప్ప మార్పులు సాధిస్తారు. మాటల మాంత్రికుడైన ప్రధాని మోదీ, ఈ సత్యానంతర ప్రపంచపు రాజకీయ సందేశకులలో అగ్రగామి. మనసుకు హత్తుకుపోయే ఊతపదాలు లేదా నినాదాలు సృష్టించడం మోదీ భావప్రసార నైపుణ్యాలలో ఒకటి. ఢిల్లీలో అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలో జాతికి ఆయనిచ్చిన నినాదాలు 'మేక్ ఇన్ ఇండియా', 'స్వచ్ఛ భారత్'. అధికారంలో ఉన్న రెండో సంవత్సరం – 2015–లో 'స్టార్టప్ అండ్ స్టాండ్ అప్ ఇండియా' అంటూ యువభారతీయులకు ఆయన ఒక కొత్త వ్యవస్థాపనా సామర్థ్య స్ఫూర్తిని కలిగించారు. మూడో సంవత్సరం




–2016–లో 'డిజిటల్ ఇండియా' స్వప్నాన్ని ఆవిష్కరించారు. ఇక నాలుగో సంవత్సరమైన ఈ ఏడాది, ఐదేళ్లలో అంటే 2022 నాటికి కలసికట్టుగా 'నవ భారత్'ను నిర్మించుకుందామనే ఉత్తేజకరమైన లక్ష్యాన్ని జాతికి మోదీ నిర్దేశించారు. నాలుగేళ్లుగా ఎర్రకోట బురుజుపై త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి మోదీ ఎలుగెత్తిన ఈ మాటలు దేశ ప్రజల మనసులను మంత్రిస్తున్నాయి. మంత్రముగ్ధులను చేసే మోదీ సందేశాలు, ఆయన సదుద్దేశాలను అటుంచితే అసలు 'నవ భారత్' అనే స్ఫూర్తిదాయక భావన సూచించేదేమిటి?

గోరఖ్‌పూర్ ప్రభుత్వాసుపత్రిలో ఆక్సిజన్ కొరతతో డజన్ల సంఖ్యలో బాలలు మరణించారు. దేశంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతాలలో ఒకటైన గోరఖ్‌పూర్ జిల్లాలో ఏటా వర్షాకాలంలో మెదడువాపు వ్యాధి ప్రబలడం దశాబ్దాలుగా పరిపాటిగా వస్తోంది. మరి ఇటువంటి విపత్కర పరిస్థితి ఎదురవుతుందని ముందుగా తెలిసివుండి కూడా రోగగ్రస్తులకు సరైన వైద్యం అందించడానికి వైద్యాధికారులు సన్నద్ధంగా ఉండకపోవడమే 'కొత్త భారతదేశ' లక్షణమా? మెదడువాపు వ్యాధిని నిర్మూలిస్తామని, ఆరోగ్యభద్రత రంగంలో ప్రభుత్వ వ్యయాలను మరింత పెంచుతామని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పటిష్ట పరుస్తామని ప్రధానమంత్రి మనకు హామీ ఇస్తున్నారా? నిజమేమిటంటే ఈ దేశంలో ప్రజారోగ్య వ్యవస్థ ఐసీయూ (ఇంటెన్సివ్ కేర్ యూనిట్)లో ఉన్నది.

ఈశాన్య భారత రాష్ట్రమైన అసోం ఏటా బ్రహ్మపుత్ర వరదలతో అతలాకుతలమవుతూ వుంటోంది. 'నూతన భారతదేశం'లో కూడా, ఈ వార్షిక ప్రాకృతిక విపత్తు మరోసారి సంభవించినప్పుడు సైతం వేలాది కుటుంబాలు యథావిధిగా నిర్వాసితులవడం జరుగుతుందా? నదీనదాల దురాక్రమణను నిరోధిస్తామని, వరద నీరు స్వేచ్ఛగా సాగిపోయేందుకు కొరవడిన సదుపాయాలను కల్పిస్తామని, అడవుల నిర్మూలనను అరికడతామని ప్రభుత్వం మనకు హామీనిస్తుందా?

దేశవ్యాప్తంగా లక్షలాది బాలలకు నాణ్యమైన విద్యను సమకూర్చడంలో ప్రభుత్వ పాఠశాలలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్న దుస్థితిని 'కొత్త భారత్' ప్రతిబింబిస్తుందా? ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రాథమిక పాఠశాలల్లో 18శాతం, మాధ్యమిక పాఠశాలల్లో 15శాతం ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని 2016 డిసెంబర్‌లో పార్లమెంటులో మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి ఒక ప్రకటనలో అంగీకరించారు. సమీప భవిష్యత్తులో ఈ ఉపాధ్యాయుల కొరతను పూర్తిగా తొలగిస్తామని ప్రభుత్వం కచ్చితమైన హామీ ఇవ్వగలదా?

వ్యవసాయ భూములు అంతకంతకూ తగ్గిపోతున్న, సన్న, చిన్నకారు రైతులు గ్రామీణ వడ్డీ వ్యాపారస్తులకు రుణగ్రస్తులవుతున్న, పంట పుష్కలంగా పండిన సంవత్సరాలలోనూ తమ ఫలసాయానికి తగు మద్దతు ధర లభించక రైతులు నష్టపోతున్న దేశం 'నవ భారత్' అవుతుందా? ఈ ఏడాది మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో పప్పుధాన్యాలు రికార్డుస్థాయిలో పండాయి. అయినా వందలాది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ దుస్థితిని ఎలా అర్థం చేసుకోవాలి?

విద్యాభ్యాసం ముగించుకున్న యువజనులు ఏటా లక్షల

సంఖ్యలో ఉద్యోగ విపణిలోకి ప్రవేశిస్తున్నారు. అయితే చాలా కొద్దిమందికి మాత్రమే ఉద్యోగాలు లభిస్తున్నాయి. అసలు ఉద్యోగం లభించకపోవడం, లభించినా తమ అర్హతలకు తగిన ఉద్యోగం లభించకపోవడంపై లక్షలాది యువ విద్యావంతులు తీవ్ర నిరాశానిస్పృహలకు లోనవుతున్నారు. యువజనులు ఇటువంటి నిరుత్సాహానికి లోను కావాల్సిన పరిస్థితులు 'కొత్త భారతదేశం'లో కన్పించకుండా పోతాయా? మన ఆర్థికవ్యవస్థ వృద్ధి చెందుతున్న మాట నిజమేగానీ, అది ఉపాధి అవకాశాలు కల్పించని అభివృద్ధి మాత్రమేనని, మరీ ముఖ్యంగా పెద్ద నోట్ల రద్దు అనంతరం ఈ పరిస్థితి మరీ పెరిగిపోయిందన్న వాస్తవాన్ని ప్రభుత్వం అంగీకరిస్తుందా? పెద్ద నోట్ల రద్దు పర్యవసానంగా 2017 సంవత్సరం మొదటి నాలుగు నెలల్లో దేశ ఆర్థిక వ్యవస్థ 15లక్షల ఉద్యోగాలను కోల్పోయిందని 'సెంటర్ ఫర్ మానిటరింగ్ ది ఇండియన్ ఎకానమీ' (సీఎంఐఈ) తాజా అధ్యయనం వెల్లడించింది.

గుంటలు, గోతులు లేని రోడ్లను సమకూర్చడంలో మునిసిపల్ అధికారులు విఫలమవుతున్నారు. ఇటువంటి దుర్భర రోడ్లపై ప్రమాదాలకు లోనై ఏటా వందలాది మంది మరణిస్తున్నారు. మెరుగైన రోడ్లను నిర్మించడం ద్వారా అటువంటి ప్రమాదాలను 'నవ భారత్' నివారించగలదా? రోడ్ల నిర్మాణానికి కాంట్రాక్టు తీసుకున్నవారు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించడంలో విఫలమయినందుకు శిక్షకు గురవ్వడం చివరిసారి జరిగిందెప్పుడు? మునిసిపాలిటీల పాలకులు, అధికారుల్లో జవాబుదారీతనం లోపించడం వల్లే పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల పరిస్థితి అంతకంతకూ క్షీణించిపోతోంది. ఈ పరిస్థితుల కారణంగానే 'స్మార్ట్ సిటీ' భావన ప్రజలకు ఆకర్షణీయంగా ఉన్నది. అయితే 'స్మార్ట్ సిటీ'లతో పట్టణప్రాంతాల మౌలిక సమస్యలు పరిష్కారమవుతాయనుకోవడం కేవలం భ్రమ మాత్రమేనని చెప్పక తప్పదు. న్యాయస్థానాల్లో లక్షల సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఇటువంటి పరిస్థితిని నివారించి న్యాయాన్ని శీఘ్రగతిన ప్రసాదించడం 'నవ భారత్'లో సుసాధ్యమవుతుందా? వివిధ న్యాయస్థానాల్లో మూడు కోట్లకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నట్టు అధికారిక గణాంకాలే సూచిస్తున్నాయి. దేశవ్యాప్తంగా కిందిస్థాయి న్యాయస్థానాల్లో అవసరమైన మొత్తం న్యాయమూర్తుల కంటే 20 నుంచి 25శాతం మంది తక్కువగా ఉన్నారు.

మతపరమైన మైనారిటీలు నిత్యం 'దేశభక్తి' పరీక్షలకు గురవుతున్నారు. సంప్రదాయబద్ధంగా గడ్డం పెంచుకునేవారు, మదర్సాల్లో చదువుకునేవారు, ఆజాన్ చదివేవారు లేదా వందేమాతరం పాడడానికి నిరాకరించేవారు 'జాతి-వ్యతిరేకులు'గా నిందపడుతున్నారు. కాలం చెల్లిన, ప్రజాస్వామ్య వ్యతిరేకమైన ఇలాంటి ఆలోచనా ధోరణులు సమసిపోకుండా 'నవ భారత్' ఎలా సాధ్యమవుతుంది? పశు వధకు సంబంధించి కొత్తగా జారీ అయిన నియమనిబంధనలు పశువ్యాపారులపై తమ కండబలాన్ని ప్రదర్శించడానికి గోరక్షకులను ప్రోత్సహించేవిగా ఉన్నాయి. ద్వంద్వ స్వభావంతో కూడిన ఇటువంటి నిబంధనల ప్రాతిపదికన కొత్త భారత్‌ను నిర్మించగలమా? 2010 నుంచి చోటుచేసుకున్న గోరక్షకుల హింసాకాండ సంఘటనల్లో చనిపోయిన 23మందిలో అత్యధికులు (86శాతం మంది) ముస్లింలేనని, ఈ సంఘటనలలో 97శాతం 2014 వే అనంతరమే సంభవించాయని 'ఇండియా స్పెండ్' అనే డేటా వెబ్‌సైట్ వెల్లడించింది.

ప్రభుత్వాధికారుల, రాజకీయ నాయకుల అవినీతికి తావులేని 'నూతన భారతదేశాన్ని' నిర్మిస్తామని ప్రధాని మోదీ దేశ ప్రజలకు హామీ ఇచ్చారు. కేంద్రంలో ఉన్నతస్థాయి అధికారుల అవినీతిని అదుపుచేసినప్పటికీ, 'స్థానిక' (రోజువారీ) అవినీతి, ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన పనుల పూర్తిలో అకాల జాప్యం ఇంకా సామాన్య పౌరులను పలు రకాలుగా వేధిస్తున్నాయి. డబ్బు తీసుకుని రక్షణ కల్పించడం (హఫ్తా సంస్కృతి) ఇంకా మన నిత్య జీవితాల్లో భాగంగా ఉంది. ట్రాన్సపరెన్సీ ఇంటర్నేషనల్ కరప్షన్ పెర్సప్షన్స్ ఇండెక్స్‌లో మనదేశం మొత్తం 175 దేశాల్లో 79వ స్థానంలో ఉండటం గమనార్హం. మంత్రుల స్థాయిలో అవినీతి అంతమైందని మీరు భావిస్తున్నారా? అయితే మీరు నా సొంత రాష్ట్రమైన గోవాకు వెళ్లండి. ఒక కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకై మద్దతు ఇచ్చేందుకు తమ 'రేటు' ఎంతో శాసనసభ్యులు స్వేచ్ఛగా చర్చించుకోవడాన్ని మీరు గమనించగలరు.

సత్యమేమిటంటే, 'నవ' భారత్, కనీసం ప్రస్తుతానికి, సాకారం సాధ్యం కాని స్వప్నం. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చాలా నైపుణ్యంగా అల్లిన స్వప్నమది. 'అచ్చేదిన్' హామీ 2014 సార్వత్రిక ఎన్నికల్లో తనకు విజయం సమకూర్చిందని, అయితే అది ప్రజల అంచనాలకు అనుగుణంగా నెరవేరలేదనే సత్యం ఆయనకు బాగా తెలుసు. మొదటి మూడు సంవత్సరాల్లో నెరవేరని హామీల ఫలితంగా తన పాలనపై ప్రజలు పెట్టుకున్న నమ్మకం తొలగిపోవడం ప్రారంభమవ్వడంతో వారిని ఆకట్టుకోవడంలో కొత్త మార్గం అనుసరించడం ఆవశ్యకమయింది. కనుకనే 'నవ భారత్' అనే కొత్త స్ఫూర్తిదాయక లక్ష్యాన్ని ప్రధాని మోదీ దేశ ప్రజలకు నిర్దేశించారు.

*(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)* ❍

# మోదీ ఎన్నికల బాకీ: తెలంగాణ ధాన్యం రైతులకే, ఒక్క రబీలోనే రూ.7,000కోట్లు!

- ధాన్యానికి దక్కాల్సిన మద్దతు ధరలు రూ.3,237, 4,136..
- రైతులకు ఇచ్చింది మాత్రం రూ. 1470, 1510



రాష్ట్రంలో రైతులు పెడుతున్న ఖర్చుకు తగ్గ మద్దతు ధర ఇవ్వాలని భారత వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్ (సీఏసీపీ)ని తెలంగాణ వ్యవసాయ శాఖ గత ఖరీఫ్ సీజన్‌కు ముందు కేంద్రాన్ని కోరింది. పత్తి తదితర వాణిజ్య పంటలు వద్దని కేంద్రం చెబుతున్నప్పుడు.. ఇతర పంటలు సాగుచేసే రైతులకు న్యాయమైన మద్దతు ధరను ప్రకటించాలని స్పష్టంచేసింది. సాధారణ వరి ధాన్యం పండించటానికి క్వింటాకు రూ. 2,158 ఖర్చవుతుందని, ఏ గ్రేడ్‌కు రూ. 2,758 ఖర్చు పెట్టాలని, కానీ వీటికి మద్దతు ధర మాత్రం రూ. 1470, 1510 మాత్రమే ప్రకటించారని వ్యవసాయ శాఖ అభ్యంతరం తెలిపింది (ఈ ఏడాది మరో రూ. 80లను వరికి మద్దతు ధరగా కేంద్రం ప్రకటించింది). రైతులకు న్యాయమైన మద్దతు ధరగా సాగు వ్యయానికి 50శాతం జోడించి వరి రకాలకు రూ. 3,237, రూ. 4,136 మద్దతు ధరగా ప్రకటించాలని సీఏసీపీని కోరింది. రైతులు పెట్టే ఖర్చుల వివరాల్ని, పంటలకు ఇవ్వాల్సిన మద్దతు ధరల్ని తెలంగాణ వ్యవసాయ శాఖ కేంద్ర కమిషన్‌కు నివేదించింది. పంటలవారీగా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, పంట కోత, రవాణా, కూలీ, రైతు కుటుంబ శ్రమకు ప్రతిఫలం తదితరాలన్నిటినీ మదింపు చేసి ఈ నివేదికను పంపింది. కానీ తాజా రబీలో రికార్డుస్థాయిలో

| తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన పంట ఖర్చు, మద్దతు ధరలు (క్వింటాకు రూపాయల్లో).. | | | |
|---|---|---|---|
| పంట | 2017 ఖరీఫ్‌లో సాగువ్యయం | ఇవ్వాల్సిన మద్దతుధర | 2016-17 మద్దతుధర |
| వరి - సాధారణం | 2,158 | 3,237 | 1,470 |
| వరి - ఏ గ్రేడ్ | 2,758 | 4,136 | 1,510 |
| పత్తి | 5,608 | 8,411 | 4,160 |
| కంది | 7,123 | 10,685 | 5,050 |
| పెసర | 6,164 | 9,246 | 5,225 |
| మినుము | 5,423 | 8,134 | 5,000 |
| మొక్కజన్న | 1,949 | 2,924 | 1,365 |
| వేరుసెనగ | 4,971 | 7,456 | 4,120 |
| సోయాచిక్కుడు | 3,239 | 4,858 | 2,775 |

ధాన్యం దిగుబడి జరిగినా, పొరుగు రాష్ట్రాల్లో డిమాండ్ ఉన్నా కూడా తెలంగాణ ప్రభుత్వం సైతం రైతులకు మద్దతు ధరకు మించి తాను మాత్రం అదనంగా రూపాయి ఇవ్వలేదు. ఇవ్వటానికి మార్కెటింగ్ వ్యూహాలను ఆలోచించే ప్రయత్నం చేయలేదు. బస్తాకి రూ.200 బోనస్ కూడా ఇవ్వలేదు. తెలంగాణలో 2016-17 రబీ సీజన్‌లో దాదాపు 40లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. అంటే సరైన మద్దతు ధర ఇవ్వకపోవటం వల్ల, నరేంద్ర మోదీ ఎన్నికలలో ఇచ్చిన హామీని (స్వామినాథన్ కమిషన్ సిఫార్సు అమలు చేస్తామని) నెరవేర్చకపోవటం వల్ల తెలంగాణ రైతులు ఒక్క రబీ సీజన్‌లోనే, ఒక్క ధాన్యం పంటకే రూ.7,000కోట్లు పైచిలుకు నష్టపోయారు. మిల్లర్లకు అమ్ముకున్న రైతుల పంటను కూడా లెక్కేస్తే ఈ నష్టం ఇంకా అనేక వేలకోట్లు ఉంటుంది.

క్వింటాలుకు రూ.3,237, రూ.4,136 ధాన్యం రైతులకు తెలంగాణ ప్రభుత్వమో, కేంద్రమో ఇవ్వాలని లోక్‌సత్తా డిమాండ్ చేయటం లేదు. జనాభాలో అత్యధికశాతం వ్యవసాయరంగంలో ఉన్నప్పుడు వారి భారమంతా మిగిలిన తక్కువశాతం మంది మోయాలనటం సరికాదని, అది ఆర్థికవ్యవస్థను దెబ్బతీస్తుందని రైతుల్లో వ్యతిరేకత వచ్చినా లోక్‌సత్తా స్పష్టంగానే చెబుతూ వస్తోంది. ప్రత్యామ్నాయంగా రైతుకు ఆదాయాన్నిచ్చే మార్కెట్ సంధాన వ్యవసాయ విధానాలను చూపిస్తోంది. కానీ తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది రబీలో మార్కెట్లో అవకాశమున్నా కూడా రైతులకు ఆదాయాన్ని పెంచేందుకు కనీస ప్రయత్నం చేయటాన్ని మాత్రం నిరసిస్తోంది. రైతు కష్టమెంతో, ఎంత ఆదాయం రావాలో తెలిసి కూడా, కేంద్రానికి నివేదికలు పంపి కూడా ఇలా చేయటం బాధాకరం.

రైతుల కష్టం, వివిధ పంటలకు ఇవ్వాల్సిన మద్దతు ధరపై తెలంగాణ ప్రభుత్వం గత ఖరీఫ్‌కి ముందు కేంద్రానికి పంపిన లెక్కలు:

- కిలో ఏ గ్రేడ్ ధాన్యం పండించటానికి తెలంగాణలో సగటున రూ.27.28 ఖర్చవుతుంటే, ప్రభుత్వం రూ.15.10 ఇస్తోంది. అంటే కిలోకు రూ.12.18 నికర నష్టమన్నమాట.
- సామాన్యులు కొనే మెరుగైన గ్రేడ్ బియ్యం పండించటానికి కిలోకు రూ.42.43వరకు రైతు ఖర్చుపెడుతుంటే, ప్రభుత్వం రూ.23.23 మాత్రమే మద్దతు ధరగా చెల్లిస్తోంది. ఈ బియ్యాన్నే చౌక ధరల దుకాణాల ద్వారా కిలో రూపాయికి విక్రయిస్తున్నారు. పేదలు కొనే బియ్యం ధరలు పెరుగుతాయన్న నెపంతో మద్దతు ధరను పెంచటం లేదు (అంటే, వాస్తవ సబ్సిడీని భరిస్తున్నది రైతులే).

## కూలీ ఖర్చులే అధికం..

సాగు ఖర్చులో సగం కూలీ ఖర్చులే ఉంటున్నాయి. వరి, పత్తి పంటలకు ఈ వ్యయం అధికంగా ఉంటోంది. హెక్టారు విస్తీర్ణంలో సాధారణ వరి సాగుకు రూ.1,17,899 ఖర్చవుతోంది. ఇందులో కూలీలకు ఇచ్చే సొమ్ము రూ.52,857. రైతు కుటుంబం ఏడాది పొడవునా పొలంలో పనిచేసినందుకు ప్రతిఫలంగా మరో రూ.10వేలు ఖర్చు రాశారు. మొత్తం పంట వ్యయంలో 53.31శాతం (రూ.62,857) కూలీ ఖర్చుగా

## ఏపీకీ ఇదే తరహా నష్టం

ఆంధ్రప్రదేశ్‌లో ధాన్యం సాగుకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, దమ్ము, కూలీలు మొత్తంగా ఎకరానికి రూ.27వేల వరకు ఖర్చవుతోంది. కౌలు రూపంలో 12 నుంచి 16 బస్తాలు ఇస్తున్నారు. నగదు రూపంలో చూస్తే సగటున రూ.16వేలు పైమాటే. పెట్టుబడి కౌలువరకే రూ.43 వేలు అవుతోంది. రైతు కుటుంబ ఖర్చు కలిపి చూస్తే.. ఎకరానికి 55వేల వరకూ ఆదాయం వస్తే నష్టాలు లేకుండా బైటపడతారు. సగటు దిగుబడి 20 క్వింటాళ్ల ప్రకారం కేంద్ర మద్దతు ధరకు అమ్ముకుంటే రైతు పెట్టుబడిలోనే రూ.8,900 నష్టపోతున్నారని అంచనా. ఇదే తరహాలో ఇతర పంటలూ వున్నాయి. మద్దతు ధరపై కేంద్రం ధరలో తేడాను రాష్ట్రం భరించాలనే ప్రతిపాదనను అమలు చేయాలని, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో కొన్ని పంటలకు తాము చేసిన సిఫార్సులనే రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్నాయని డిమాండ్లు వస్తున్నాయి. రైతుకు కనీస మద్దతు ధరకన్నా గరిష్ట లాభసాటి ధర రావాలనే డిమాండ్‌పై మాత్రం ఇంకా గొంతులు పెగలటం లేదు.

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన పంట ఖర్చు, మద్దతు ధరలు

| పంట | ఇవ్వాల్సిన మద్దతుధర (క్వింటాకు రూపాయల్లో).. |
|---|---|
| వరి (సాధారణ రకం) | 2,799 |
| పత్తి | 7,564 |
| కంది | 8,976 |
| జొన్న (హైబ్రిడ్) | 2,901 |
| సజ్జ | 2,562 |
| మొక్కజొన్న | 2,449 |
| రాగి | 2,970 |
| పెసర | 8,128 |
| మినుము | 7,961 |
| నువ్వులు | 10,773 |
| పొద్దుతిరుగుడు | 7,640 |

## మద్దతు ధర కంటే ఎక్కువ ఇచ్చిన గట్టుదుద్దెనపల్లి సహకార సంఘం

కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలంలోని గట్టుదుద్దెనపల్లి సహకార సంఘం రైతులకు దీర్ఘకాలిక రుణాలివ్వటమే కాకుండా తన పరిధిలోని మూడు గ్రామాల(గట్టుదుద్దెనపల్లి, పోలంపల్లి, మల్లాపూర్)లో పండే ధాన్యాన్ని కొనుగోలు కూడా చేస్తుంది. ఇందుకోసం గిడ్డంగులను నిర్వహిస్తోంది. గత సంవత్సరం వరికి కనీస మద్దతు ధర రూ.1510 ఉన్నా, గట్టుదుద్దెనపల్లి సహకార సంఘం క్వింటాలుకు రూ.1,850 చొప్పున రైతులకు చెల్లించింది. ఇలా దాదాపు నాలుగు వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. బ్రీడర్ సీడ్‌కు రూ.1930 చెల్లించింది. ఈ ధాన్యాన్ని సొంత మిల్లులో బియ్యంగా మార్చి, కిలో రూ.38కి విక్రయించారు.

పోతున్నట్టు నివేదికలో రాశారు.

- హెక్టారు పత్తి సాగుకు రూ.1,12,152 వ్యయం కాగా, ఇందులో 47శాతం కూలీ ఖర్చులే.
- వరి రైతు కుటుంబం ఏడాది కష్టానికి రూ.10వేలు వేతనంకాగా, పత్తి రైతు కుటుంబానికి 4వేలే లెక్కేశారు.
- పత్తి వేయాలంటే హెక్టారుకు రూ.15వేలు, వరికి రూ.20వేలు కౌలు కింద కట్టాలి. వాస్తవానికి పలు ప్రాంతాల్లో పత్తి పండించటానికి రైతులు ఎకరానికి రూ.10-12 వేలు దాకా కౌలు చెల్లిస్తున్నారు. వ్యవసాయశాఖ పత్తికి సగటున ఎకరానికి రూ.6వేల చొప్పునే లెక్కలోకి తీసుకున్నారు.
- తెలంగాణలో ఈ ఏడాది రైతులు ఎక్కువగా పత్తి మానేసి సోయా చిక్కుడు, పప్పుధాన్యాల వైపు మొగ్గుచూపారు. ఈ పంటలకు పెరుగుతున్న ఖర్చులు ఏమాత్రం గిట్టుబాటు కావటం లేదు.
- పప్పు ధాన్యాల సాగుపై దృష్టి మళ్లించాలని కేంద్రం తరచూ చెబుతోందిగానీ, మద్దతు ధరల విషయంలో మాత్రం వాటికి ప్రోత్సాహకాలేమీ ఇవ్వటం లేదు. తెలంగాణలో కంది, మినుము, పెసర, సోయా పంటల సాగువ్యయానికీ, ఇస్తున్న మద్దతు ధరకీ చాలా వ్యత్యాసముంది. ○

# సురాజ్యానికి విధానాలేవీ?

దేశానికి స్వతంత్రం వచ్చి డెబ్బై ఏళ్లు గడిచినా ప్రజలకు ఇంకా సురాజ్యం రాలేదని, స్వాతంత్ర్య ఫలాలు వారికి అందలేదని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయనగరంలోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జెండావందనం కార్యక్రమంలో ఆయన పాల్గన్నారు. స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించారు.



దేశవ్యాప్తంగా దాదాపు 34 కోట్లమందికి ఇంకా కనీసస్థాయి విద్య, ఆరోగ్యం అందటంలేదని, పనిచేసేవారిలో 90శాతంమందికి జీవన భద్రత లేదని బాబ్జీ అన్నారు. ప్రజలు తమ సమస్యల్ని పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను, ఉద్యోగులను ఏర్పాటు చేసుకుని తమ పన్నుల డబ్బుతో వారికి జీతాలను, సౌకర్యాలను కల్పిస్తుంటే.. అసలు లక్ష్యమైన ప్రజాసేవకే ఎసరుపెట్టి కొసరు రాజకీయాలు, ఎన్నికలు, జీతభత్యాల పెంపు ముచ్చట్లు ఎక్కువైపోయాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎర్రకోట మీద నుంచి లోక్‌సత్తా ఎన్నాళ్లగానో చెబుతున్న సురాజ్య నినాదాన్ని ఇచ్చారని, కానీ ఆ సురాజ్యాన్ని సాధించేందుకు తగిన విధానాల గురించి మాత్రం ప్రధాని చెప్పలేదని అన్నారు. నోటి మాటగా సురాజ్యం వచ్చేయదని, దానికి తగిన విధానాలుండాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సొమ్ముతో పలు పథకాలు అమలుచేస్తున్నా, అవినీతి, పేలవమైన విధాన రూపకల్పన వల్ల ఆశించిన ఫలితాలు రావటం లేదన్నారు. పేదరికం, వివక్ష, ప్రజల్లో ద్వితీయ శ్రేణి పౌరుల్లా యాచించే సంస్కృతి తొలగటం లేదన్నారు. వ్యవస్థను మార్చగలిగే నిజాయతీ, సమర్థత గల నాయకులు ఎన్నికయ్యేలా రాజకీయాల్ని, ఎన్నికల వ్యవస్థని మార్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నేతలు నాగభూషణం, కోటేశ్వరరావు, రాజారావు, రమేష్, శ్రీను, అప్పారావు, చంద్రరావు, కాళ్లశ్రీను, భాస్కర్, ఎర్నిబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జలసిరిలో అన్యాయం..

**గాంధీ విగ్రహం వద్ద లోక్‌సత్తా నిరసన**




విజయనగరం జిల్లాకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్యాయం చేస్తున్నా మంత్రులు అశోక్ గజపతిరాజు, సుజయ్‌కృష్ణ రంగారావు, ఎమ్మెల్యేలు తమ పదవుల కోసం వెంపర్లాడుతున్నారని బాబ్జీ ఆరోపించారు. ముఖ్యమంత్రి జలసిరి పేరుతో ఎంపికచేసిన ప్రాజెక్టుల్లో విజయనగరం జిల్లాకి సంబంధించినవి ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. జిల్లాలో వర్షాభావంతో ప్రజల్లో చాలా ఇబ్బందులు పడుతున్నా పెండింగ్ ప్రాజెక్టులను పట్టించుకోవటం లేదన్నారు. రైతుల్లో ఎన్నడూ లేనంత ఆందోళన నెలకొందన్నారు. పెద్దగడ్డ, జంఝావతి, ఒట్టిగెడ్డ, వెంగళరాయ, ఆంధ్ర జలాశయాల పరిధిలోని 40శాతం భూముల్లో ఇంకా సాగు ఊపందుకోలేదన్నారు. అయినా నేతలు, జిల్లా అధికార యంత్రాంగం పట్టించుకోవటం లేదన్నారు. పాలకుల తీరుని నిరసిస్తూ లోక్‌సత్తా పార్టీ నేతలు, రైతులతో కలిసి కలెక్టరేట్ వద్దనున్న గాంధీ విగ్రహం వద్ద బాబ్జీ నిరసన తెలియచేశారు. కర్రి నాగేశ్వరరావు, సంజీవి, నాగభూషణం, చందు, ఎర్నినాయుడు, సత్యం, గోవింద, చలపతి, కనకరాజు, పలువురు మహిళలు పాల్గొన్నారు. ❍



# జలవివాదాలపై రెండేళ్లలోనే తీర్పు

## - కొత్త బిల్లుపై స్థాయీ సంఘం సిఫార్సులు -

కొత్త జలవివాద చట్టం అమల్లోకి వచ్చాక అంతర్రాష్ట్ర జలవివాదాలపై ట్రైబ్యునళ్లు రెండేళ్లలోనే తుది తీర్పు వెలువరించేలా గడువు నిర్దేశించాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఇప్పుడున్న విభిన్న నదీజలాల ట్రైబ్యునళ్ల స్థానంలో ఒకే ట్రైబ్యునల్ ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'అంతర్రాష్ట్ర జలవివాదాల (సవరణ) బిల్లు-2017'పై అధ్యయనం చేసిన ఈ సంఘం పలు మార్పులు, చేర్పులు సూచిస్తూ సిఫార్సులు చేసింది.

**ప్రస్తుతం గడువు ఉంది కానీ..**

ఇప్పుడున్న అంతర్రాష్ట్ర జల వివాద పరిష్కార చట్టం-1956లోని సెక్షన్ 5(2) ప్రకారం నివేదిక అందించడానికి ట్రైబ్యునల్‌కు ప్రాథమికంగా మూడేళ్ల గడువు ఉంది. ఏదైనా కారణం చేత ఆలోపు తుది నిర్ణయం వెలువడకపోతే గడువును మరో రెండేళ్లు పొడిగించే అధికారం కేంద్రానికి ఉంది. ట్రైబ్యునల్ నిర్ణయంపై వాది, ప్రతివాదుల్లో ఎవరైనా విభేదిస్తూ సెక్షన్ 5(3) కింద దాన్ని పున:పరిశీలించాలని కోరితే దానిపై తీర్పు చెప్పడానికి మరో ఏడాది సమయం ఉంది. అప్పుడు కూడా నివేదిక ఇవ్వలేకపోతే కేంద్ర ప్రభుత్వం గడువు పొడిగించే వీలుంది. ఇందుకు నిర్దిష్ట కాలపరిమితి లేదు. అంటే గడువును నిరవధికంగా పొడిగించే వెసులుబాటు కేంద్రానికి ఉంది.

**అందుకే నిర్దిష్ట కాలపరిమితి**

తాజా బిల్లులో సెక్షన్ 5(2) కింద గడువును రెండేళ్లకు, సెక్షన్ 5(3)కింద గడువును ఏడాదికి తగ్గించారు. ఆ తర్వాత ఏదైనా అభ్యంతరాలు వస్తే గడువును ఏడాదిపాటు పొడిగించడానికి అవకాశం కల్పించారు. ఆ తర్వాత గరిష్ఠంగా మరో ఆరు నెలల సమయం ఇవ్వవచ్చు. అంటే గడువును నాలుగున్నరేళ్లకు తగ్గించినట్టు కనిపిస్తున్నా చిన్న మెలిక ఉంది. కొత్త బిల్లులో నూతనంగా ఏర్పాటయ్యే ప్రాథమిక స్థాయి వివాద పరిష్కార కమిటీ నిర్ణయం వెలువరించడానికి ఏడాదిన్నర, తర్వాత ట్రైబ్యునల్ తుది తీర్పు వెలువరించడానికి నాలుగున్నరేళ్ల గడువు ఇచ్చారు. అంటే ఆరేళ్ల సమయం ఇచ్చినట్టయింది. అందువల్ల ట్రైబ్యునల్ తీర్పునకు గరిష్ట పరిమితిని రెండేళ్లకు తగ్గించాలి.

**రిపోర్టు కాదు.. ఆర్డర్**

ట్రైబ్యునల్ వెలువరించే అంతిమ నిర్ణయాన్ని 'రిపోర్ట్'గా చెప్పకూడదు. 'ఆర్డర్' అని కానీ, 'అవార్డ్' అని కానీ చెప్పాలి. అప్పుడే ఈ తీర్పునకు కోర్టు వెలువరించే డిక్రీ హోదా దక్కుతుంది. దీనిని అమలుచేయడానికి ఎప్పటికప్పుడు మంత్రిత్వశాఖ జోక్యం చేసుకోవాలి.

**ఇదే తుది తీర్పు**

వివాదాలను అంతులేకుండా పొడిగించడానికి వీలు

## ఆలస్యానికి మూల్యం లక్ష కోట్లు!

సాగునీటి ప్రాజెక్టుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాప్యం వల్ల ప్రజల సొమ్ము ఎలా వృథా అవుతోందో, పెంచిన అంచనాల పేరుతో కాంట్రాక్టర్లకు, రాజకీయ నాయకుల బినామీలకు ఎన్ని వేలకోట్లు ధారాదత్తమవుతోందో ఏళ్ల తరబడి చూస్తూనే ఉన్నాం. ప్రభుత్వం ఏదైనా తంతు ఇదే. విద్యుత్తు, రైల్వే తదితర రంగాలలోని ప్రాధాన్య ప్రాజెక్టుల విషయంలోనూ ఇదే తీరును పాలకులు కొనసాగిస్తున్నారు. గడచిన పద్నాలుగేళ్ల వ్యవధిలో, ఒక్క కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే.. వివిధ రంగాలలో చేపట్టిన ప్రాజెక్టులు నిర్ణీత గడువు కంటే ఆలస్యంగా సాగుతున్న కారణంగా రూ. 1.15లక్షల కోట్ల అధికభారం పడుతున్నట్టు రిజర్వుబ్యాంకు అంచనా.

2002 నుంచి 2016 మధ్యకాలంలో కేంద్రం తలపెట్టిన 343 ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం కారణంగా లక్ష కోట్లకు పైగా మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తోందని బ్యాంకు వెల్లడించింది. రూ. 100 కోట్ల నుంచి 150కోట్లకు పైబడిన ప్రాజెక్టులను పరిగణలోకి తీసుకుని ఈ అంచనా రూపొందించారు. ప్రాజెక్టు ప్రారంభ తేదీలు పక్కాగా ఉన్నవాటిని మాత్రమే పరిగణలోకి తీసుకున్నారు.

- 2002లో రూ. 31,400 కోట్ల అంచనా వ్యయంతో 49 ప్రాజెక్టులు చేపట్టగా ఇప్పుడు వాటికి రూ. 56,700కోట్లు ఖర్చు పెట్టాల్సి వస్తోంది.
- ఏటా కొత్తగా వచ్చిన ప్రాజెక్టులతో కలిపి 2016 నాటికి వాటి సంఖ్య 343కి చేరింది. వీటి వాస్తవ అంచనా వ్యయం రూ. 5,28,800కోట్లు కాగా, తాజా అంచనా ప్రకారం ఈ లెక్కలు రూ. 6,44,700కోట్లకు చేరింది. అంటే 14 ఏళ్లలో అదనంగా రూ. 1,15,800కోట్లు చెల్లించుకోవలసి వస్తోంది. ఏటా సగటున రూ. 10,000కోట్లకు పైగా అంచనా వ్యయం పెరుగుతూపోతోంది. అణువిద్యుత్తు, సాధారణ విద్యుత్తు, రైల్వే ప్రాజెక్టులు ఇందులో ఉన్నాయి.
- టెలికాం సెక్టార్‌లో మాత్రం అంచనాల కంటే వ్యయం తగ్గుతోంది. రెండు ప్రాజెక్టుల నిర్మాణానికి రూ. 15,400 కోట్ల వ్యయం అంచనా వేయగా, చివరకు అది రూ. 15,300కోట్లకు తగ్గింది.

లేకుండా ట్రైబ్యునల్ ఇచ్చే తీర్పే అంతిమం అని చెబుతూ కొత్త బిల్లులో కొత్తగా 6వ సెక్షన్‌ను చేర్చడం మంచిదే. ఇది సుప్రీంకోర్టు తీర్పుతో సమానం కాబట్టి అన్ని రాష్ట్రాలూ కట్టుబడి ఉండాలి.

### కొలీజియంను ఏర్పాటు చేయాలి

ట్రైబ్యునల్‌కు ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌తో పాటు గరిష్ఠంగా ఆరుగురు సభ్యులను సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నుంచి నియమించాలి. నియమించే అధికారాన్ని కేవలం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఒక్కరికే కట్టబెడుతూ బిల్లులో పొందుపరచడం తగదు. నియామకాల కోసం నలుగురు సభ్యులతో ప్రత్యేక ప్యానల్/కొలీజియం ఏర్పాటు చేయాలి. ఇందులో ప్రధానమంత్రి, లేదా ఆయన నియమించిన ప్రతినిధి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, లేదా ఆయన నియమించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి, ప్రతిపక్ష నాయకుడు, జలవనరులశాఖ మంత్రి సభ్యులుగా ఉండాలి. సభ్యులను తొలగించే అధికారం కూడా కొలీజియానికి ఉండాలి.

### నిపుణులకూ చోటుండాలి

ఛైర్‌పర్సన్‌గా సిట్టింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి, వైస్‌ఛైర్మన్‌గా సిట్టింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తికానీ, హైకోర్టు న్యాయమూర్తికానీ ఉండాలి. ఆరుగురు సభ్యుల్లో కనీసం ముగ్గురికి జలవనరుల రంగంలో విశేషానుభవం ఉండాలి. ఛైర్మన్ గరిష్ఠ వయోపరిమితి 70 ఏళ్లు. వైస్‌ఛైర్మన్, ఇతర సభ్యుల గరిష్ఠ వయోపరిమితి 67 ఏళ్లకు పరిమితం కావాలన్న నిబంధన సమర్థనీయమే.

### అయిదు ధర్మాసనాలు పనిచేసే అవకాశం

ప్రస్తుతం నడుస్తున్న అయిదు ట్రైబ్యునళ్లలో 107మంది సిబ్బంది ఉంటే కొత్త ట్రైబ్యునల్‌లో ఆ సంఖ్యను 80కి తగ్గించారు. కొత్త చట్టం అమల్లోకి వచ్చాక ఒకే సమయంలో అయిదు ధర్మాసనాలు పనిచేసే అవకాశం ఉన్నందున తగినంతమంది సిబ్బందిని ఇవ్వాలి. ధర్మాసనాల ఏర్పాటు అధికారాన్ని ఛైర్మన్‌కే వదిలిపెట్టాలి. ముగ్గురు సభ్యులతో ఒక ధర్మాసనాన్ని ఏర్పాటు చేయవచ్చు. ఒక ధర్మాసనం సభ్యుడు మరో ధర్మాసనంలో కొనసాగవచ్చు. అత్యంత సీనియర్ సభ్యుడు దానికి నేతృత్వం వహించటం సబబే.

ట్రైబ్యునల్‌లోని ఖాళీలను నెలలోపలే భర్తీ చేసేలా నిబంధన పెట్టాలి.

ప్రస్తుత బిల్లులోని సెక్షన్ 4డీ ప్రకారం ఢిల్లీ బయట ఎక్కడైనా ధర్మాసనం ఏర్పాటు చేసే అధికారం ఛైర్మన్‌కు ఉంది. ఇలాంటి సందర్భాల్లో ఆర్థిక భారాన్ని అంచనా వేయాలి. ❍

# తెలంగాణ రాష్ట్రానికి నూతన కమిటీల్ని ప్రకటించిన లోక్‌సత్తా పార్టీ

లోక్‌సత్తా పార్టీ తెలంగాణ కార్యవర్గాన్ని పునర్నిర్మించినట్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు తెలిపారు. ప్రస్తుతమున్న అన్ని కార్యవర్గాలూ రద్దయి, కొత్త కార్యవర్గాలు వెంటనే అమల్లోకి వస్తాయన్నారు. నూతన కమిటీల గురించి లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌కు కూడా తెలియచేశామన్నారు.

లోక్‌సత్తా ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కొత్త కార్యవర్గం నూతనోత్సాహంతో పనిచేస్తుందని, వచ్చే ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసేందుకు సమష్టిగా కృషి చేస్తామని పాండురంగారావు ప్రకటించారు. వివరాలను మీడియాకు విడుదల చేశారు.

**లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర**

**నూతన కార్యవర్గ వివరాలు**

**రాష్ట్ర ఉపాధ్యక్షులు** : జగన్ మెట్ల, బి. దుర్గారావు

**ప్రధాన కార్యదర్శి** : గోవిందరావు

**రాష్ట్ర కార్యదర్శులు :**

శ్రీమతి ఎన్.సరోజాదేవి, సకనాల సత్తయ్య, గట్టయ్య

**కోశాధికారి** : బాలసుబ్రహ్మణ్యం

**కన్వీనర్ కమ్యూనికేషన్స్** : హమీద్

**కన్వీనర్ లీగల్** : కోటేశ్వరరావు

**అధికార ప్రతినిధులు :**

దేవీ ప్రసాద్, సాంబిరెడ్డి, కొంగర గంగాధరరావు

**అనుబంధ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు**

| | | |
|---|---|---|
| **మహిళా సత్తా** | : | శ్రీమతి గజానని |
| **యువసత్తా** | : | శివరామకృష్ణ |
| **విద్యార్థిసత్తా** | : | రాజీవ్ |
| **కార్మికసత్తా** | : | కొండల్‌రెడ్డి |
| **సమతాసత్తా** | : | గోపాల్ |

**జిల్లా కార్యవర్గం (అధ్యక్షులు)**

| | | |
|---|---|---|
| గ్రేటర్ హైదరాబాద్ | : | దోసపాటి రాము |
| కామారెడ్డి | : | తాహీర్ |
| సంగారెడ్డి | : | నిజాముద్దీన్ |
| యాదాద్రి | : | కృష్ణ ఎం. |
| వనపర్తి | : | రామచంద్రుడు |
| గద్వాల | : | వీరేష్ |
| నల్గొండ | : | యాదగిరి |
| సూర్యాపేట | : | రవి |
| భద్రాద్రి | : | వెంకట రమణ |

**రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు**

పద్మా శేఖర్, పార్థసారథి మునికుట్ల

# తెలంగాణ 'పల్లెప్రగతి' నిర్వహణపై అసంతృప్తి

తెలంగాణలో పల్లెప్రగతి ప్రాజెక్టు నిర్వహణ సరిగా లేదంటూ నిధులందిస్తున్న ప్రపంచబ్యాంకు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన డబ్బు విడుదల చేయటం లేదని, అమలుపైనా శ్రద్ధ చూపటం లేదని పేర్కొంది. పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, కార్యాచరణను ఆరంభించాలని సూచించింది. ప్రభుత్వ వాటా కింద నిధులు విడుదల చేయాలని సూచించింది. గ్రామీణ ప్రాంతాల్లో సమగ్రాభివృద్ధి లక్ష్యంగా 2015 ఫిబ్రవరిలో ప్రపంచబ్యాంకు సాయంతో పల్లెప్రగతి ప్రాజెక్టు రాష్ట్రంలో మొదలైంది. రూ.642 కోట్ల ప్రాజెక్టులో ప్రపంచబ్యాంకు రూ.450 కోట్ల రుణం ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.192 కోట్లను వెచ్చించాలి. 2020నాటికి వెనకబడిన 150 మండలాల్లోని ఆరు వేల గ్రామాల్లో దీన్ని అమలుచేయాలని నిర్దేశించారు. ఈ పథకం కింద స్వయంసహాయక సంఘాలను కూడా ఏర్పాటు చేశారు.


# ప్రజాస్వామ్య సంస్కరణల కోసం ఎదురుచూస్తున్న దేవుని రాజ్యం

కేరళ ఒకప్పుడు బీజేపీకి ఏమాత్రం పట్టులేని రాష్ట్రాలలో ఒకటిగా ఉండేది. 2009 ఎన్నికల్లో ఆ పార్టీకి అక్కడ కేవలం 6.4శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. కానీ 2014 సాధారణ ఎన్నికల్లో బీజేపీ ఓట్ల శాతం 10.3కి పెరిగింది. దేశవ్యాప్తంగా వీచిన నరేంద్ర మోదీ గాలి వల్ల ఓట్ల శాతం పెరిగిందని అక్కడ ప్రాబల్యమున్న సీపీఎం నాయకులు భావించారు. కానీ, ఆ తర్వాత నిర్వహించిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో బీజేపీ మరింత బలపడి 16శాతం ఓట్లు సాధించటంతో వామపక్ష నేతల్లో ఆందోళన మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల్లో కమ్యూనిస్టులు విజయం సాధించినప్పటికీ బీజేపీ ఎదుగుదలను కట్టడి చేసేందుకు గట్టి చర్యలను మొదలుపెట్టారు. బీజేపీ విస్తరణకు అడ్డుకట్ట వేయటానికి అన్నిరకాలుగా వ్యూహాలను అమలుచేస్తున్నారు. కేరళలో గొప్ప సంస్కర్తలుగా పేరొందిన ఆధ్యాత్మిక గురువులను భుజానికెత్తుకుంటున్నారు. అయ్యంకాళి, చట్టాంబి స్వామికళ్, నారాయణ గురు వంటి వారి బోధనలకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. ఇంతకు ముందు వరకు ఆర్‌ఎస్‌ఎస్ నిర్వహించే కృష్ణ శోభాయాత్రను సీపీఎం వ్యతిరేకించేది. అలాంటిది ఇప్పుడు కృష్ణాష్టమి సమయంలో చట్టాంబి స్వామికళ్ జయంతిని కేరళ సీపీఎం నిర్వహిస్తోంది. నారాయణ గురు శతజయంతి ఉత్సవాలనూ నిర్వహించింది. కేరళలో 27శాతం ఉన్న ఎజావాల్లో మంచి ఆదరణ ఉన్న శ్రీనారాయణ ధర్మ పరిపాలన యోగం (ఎస్ఎన్‌డీపీ) సంస్థకు సంబంధించిన రాజకీయ విభాగం 'భారత్ ధర్మ జన సేన' (బీజేడీఎస్) నారాయణ గురు గొప్పతనాన్ని వాడుకునే ప్రయత్నాలు చేస్తుందన్న ఉద్దేశంతో సీపీఎం జాగ్రత్త పడుతోందని అంటున్నారు. కేరళలో బలమైన సామాజిక వర్గం,




### బీజేపీకి 'చే' సమస్య





అర్జెంటీనాలో పుట్టి క్యూబా విప్లవంలో చురుగ్గా పాల్గొని బొలీవియాలో అమెరికా మూకల చేతుల్లో మరణించిన ఎర్నెస్టో చే గువేరా అంటే ఇతర చోట్లలోలానే కేరళ మార్క్సిస్టులలోనూ ఆరాధనాభావం ఉంది. యువతలో చే బొమ్మల్ని, హీరోయిజాన్ని కమ్యూనిస్టులు విపరీతంగా ప్రచారం చేశారు. 1970ల కాలంలో కేరళలో కాలేజీ గోడలపై, ప్రభుత్వ భవనాలపై, బిల్ బోర్డులపై చే బొమ్మలు, పెయింటింగులు తెగ కనిపిస్తుండేవి. అంతకాకపోయినా, ఇప్పటికీ చే అంటే అక్కడి యువతలో మంచి ఆదరణే ఉంది. దాన్ని సొమ్ము చేసుకునేందుకు టీ షర్టులు, కీ చెయిన్లు, బ్యాడ్జీలు మార్కెట్‌లోకి వెల్లువెత్తుతూనే ఉంటాయి. యువతలో చే గువేరా పట్ల ఉన్న బ్రాండ్ ఆదరణ కూడా తమ విస్తరణకు ఆటంకంగా ఉందని బీజేపీవారు వాపోతున్నారు. అందుకే కేరళలో చే బొమ్మల్ని చెరిపివేయాలని పనిగట్టుకుని ప్రయత్నిస్తున్నారు. చే బొమ్మల్ని తొలగించటం, నారాయణ గురును హిందూ గురువుగా ముద్రవేయటం, ఓనం పండుగను వామన జయంతిగా జరపటం వంటి మార్గాలు బెడిసికొడుతున్నా కూడా యువతను ఆకర్షించేందుకు ఈ ప్రయత్నాలు కూడా తప్పదని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి.

సీపీఎంకు గట్టి మద్దతుదారులుగా ఉన్న ఎజావాలను తన వైపు తిప్పుకోవటానికి బీజేపీ మున్ముందైనా ప్రయత్నిస్తుందన్న భయంతో సీపీఎంలో హిందూ అనుకూల అంశాలకు క్రమంగా ప్రాధాన్యం పెంచుతున్నారు. శబరిమల దేవాలయం సహా పలు అంశాలను ముఖ్యమంత్రి తరచుగా ప్రస్తావిస్తున్నారు.

దేశంలో తొలి కమ్యూనిస్టు ప్రభుత్వం కేరళలోనే ఏర్పడింది. ఆ ప్రభుత్వానికి ఈఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వం వహించారు. పార్టీ విడిపోయిన తర్వాత ఎకే గోపాలన్, ఈకే నాయర్ వంటి వారు సీపీఎం పక్షాన, అచ్యుత మీనన్ వంటి వారు సీపీఐ తరపున వామపక్ష ఫ్రంట్ మంత్రివర్గాల్లో ప్రముఖపాత్ర వహించారు. ఈ కూటమికి దీటుగా కాంగ్రెస్ నేతృత్వంలోని ఐక్య ప్రజాస్వామ్య ఫ్రంట్ (యూడీఎఫ్)ని కరుణాకరన్, ఆంటోని వంటి నాయకులు తీర్చిదిద్దారు. ఈ రెండు ఫ్రంట్‌లే వంతులవారీగా కేరళను పరిపాలిస్తూ వచ్చాయి. ఇప్పుడు వీటికి తోడు బీజేపీ పోటీదారుగా రంగ ప్రవేశం చేయటంతో రాజకీయాలు ఇంకా రక్తసిక్తమవుతున్నాయి. దేశమంతటా బీజేపీ జెండాను ఎగురవేయాలనే మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా పశ్చిమబెంగాల్, కేరళల్లో బీజేపీ పెద్ద శబ్దాలతో కార్యక్రమాలను చేస్తోంది. 1948లో గోల్వాల్కర్ ఆర్ఎస్ఎస్ చీఫ్‌గా కేరళలో మొదలుపెట్టిన ప్రయత్నాన్ని ఎలాగైనా విజయంగా మార్చాలని ఆ పార్టీ పట్టుదలతో ఉంది. కాంగ్రెస్ క్షీణత స్థానాన్ని భర్తీ చేయటానికి పలురకాలుగా ప్రయత్నిస్తోంది. తిరువనంతపురంలో బీజేపీ శరవేగంగా బలాన్ని పెంచుకుంటోంది. నగరంలో మొత్తం వంద వార్డులు ఉండగా 33వార్డులు బీజేపీ అధీనంలో ఉన్నాయి.

బీజేపీ అనుబంధ విద్యార్థి సంఘం ఏబీవీపీ (అఖిల భారత విద్యార్థి పరిషత్), మార్క్సిస్టు పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ (స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా)ల మధ్య తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. అవి విద్యార్థుల నుంచి కార్యకర్తలకు వ్యాపించాయి. బీజేపీని ఎదుర్కోవడం ఇటీవల మార్క్సిస్టులకు కష్టమవుతోంది. వాదనా పటిమతో గెలవటానికి బదులు భౌతిక దాడులకు దిగుతోంది. తిరువనంతపురంలో బీజేపీ కార్యాలయానికి సీపీఎంవారు నిప్పుపెట్టగా, మార్క్సిస్టుల ఆఫీసును బీజేపీవారు దహనం చేశారు. రెండు పార్టీలూ గూండాలను పెంచి పోషిస్తున్నాయి. రహస్యంగా సొంత సైన్యాలను నడుపుతున్నాయి. మార్క్సిస్టు పార్టీకి జిల్లా స్థాయి నుంచి హంతక దళాలున్నాయి. పట్టుబడితే అతడు తమ పార్టీ కార్యకర్త కాదని ఖండిస్తుంటుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల రాజేష్ అనే ఆర్ఎస్ఎస్ కార్యకర్త హత్య జరిగింది. సీపీఎంను ఎదుర్కోవటానికి ఇటీవల బీజేపీవారు కూడా సొంత ముఠాలను ఏర్పాటు చేసుకున్నారు. బెంగాల్‌లో మార్క్సిస్టు ప్రభుత్వాన్ని కూల్చడానికి మమతా బెనర్జీ అనుసరించిన వ్యూహాన్నే కేరళలో బీజేపీ అమలుచేస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ అధీనంలోనే హోం శాఖ ఉంది. అధికారంలో ఉండటంతో సీపీఎం గూండాలు బలంగా ఉన్నారు. విజయన్ అధికారంలోకి వచ్చాక నెలకో హత్య జరుగుతోంది. అయితే కేంద్రంలో తమ పార్టీ అధికారంలో ఉండటంతో బీజేపీవారూ తెగిస్తున్నారు. ముఖ్యమంత్రి, కేరళ బీజేపీ అధ్యక్షుడు కుమ్మానమ్ రాజశేఖరన్‌లు ఇప్పుడు శాంతిని కోరుతున్నా కార్యకర్తలు వారి అదుపు దాటిపోయారు. నారాయణ గురు వంటి సంస్కర్తలు వేసిన పునాది వల్ల అక్షరాస్యత, స్థానిక సాధికారత వంటి సానుకూల అంశాల్లో దేశంలోనే ముందున్న కేరళలో ఇప్పటికీ శాంతిభద్రతల పరిరక్షణ, చట్టబద్ధపాలన, హేతుబద్ధ బహిరంగ చర్చలు వంటి మౌలిక ప్రజాస్వామిక ప్రమాణాలు వ్యవస్థీకృతం కాకపోవటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. గల్ఫ్‌లో ఉద్యోగావకాశాలు తగ్గటం రాష్ట్ర సమస్యని మరింత సంక్లిష్టం చేస్తోంది. ఒకప్పటి దేవుని రాజ్యం కేరళ ఇప్పుడు వ్యవస్థీకృత ప్రజాస్వామ్య, విధాన సంస్కరణల కోసం ఎదురుచూస్తోంది. ❍

## 2020 నాటికి ప్రభుత్వ వ్యయం రూ.26లక్షల కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో ప్రభుత్వ వ్యయం 27శాతం పెరిగి రూ. 6.50లక్షల కోట్లకు చేరిందని (మొత్తం సంవత్సరం ఖర్చు రూ. 21.46లక్షల కోట్లు) ఆర్థికమంత్రిత్వ శాఖ తెలిపింది. బడ్జెట్‌ను ఒక నెల ముందుకు జరపటమే ఇందుకు కారణం. 2019–20నాటికి కేంద్ర ప్రభుత్వ వ్యయం రూ. 26లక్షల కోట్లకు చేరే అవకాశముంది. మూలధన వ్యయం 25శాతం పెరిగి రూ. 3.9లక్షల కోట్లకు చేరుతుందని, రక్షణరంగ వ్యయమే 22శాతం పెరుగుతుందని వెల్లడించింది. పన్నుల్లో జీఎస్టీ వాటా ఏటా 30 బేసిస్ పాయింట్లు పెరుగుతుంది. మరోవైపు, ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఉద్దేశపూర్వక ఎగవేతదార్లు మొత్తం రూ. 92,400కోట్లు బకాయిలు పడ్డట్టు ఆర్థికశాఖ సహాయమంత్రి రాజ్యసభకు తెలిపారు. 8915 ఎగవేతలు చోటు చేసుకోగా, 5,954 కేసుల్లో బ్యాంకులు చర్యలు మొదలుపెట్టాయన్నారు. ❍



# అధికార పిచ్చిని కుదిరిస్తే ఇక్కడా అరుణా మిల్లర్లు పెరుగుతారు

అధికారమంటే మనదేశంలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఉన్న పిచ్చి తెలిసిందే. సర్పంచ్ ఎన్నిక కోసం కూడా కోట్లు ఖర్చు చేస్తుంటారు. ఏ అధికారంలేని మేయర్, కార్పొరేటర్ల పదవుల కోసం గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో రూ.1000 కోట్లు దాకా సాంప్రదాయ పార్టీలు ఖర్చు చేశాయి. ఇటీవల గుడివాడ మునిసిపల్ వార్డు ఉప ఎన్నికలో తెదేపా, వైకాపా ఒక్కో ఓటరుకు రూ.15,000 పంచాయి. తాజాగా నంద్యాల ఉప ఎన్నికలో ఆ రెండు పార్టీలూ రూ.100-300కోట్లు ఖర్చు పెట్టినట్టు అంచనా. ఇటువంటి నేపథ్యంలో పదవికి పోటీపడండని నేతలను బతిమాలే దేశాలను చూస్తే మనకు ఆశ్చర్యం, కొంతయినా సిగ్గు కలగకమానదు. అమెరికాలో గతంలో విదేశాంగ శాఖ మంత్రిగా పనిచేసిన కండొలిజా రైస్‌ని గత ఏడాది ఎన్నికల్లో ఉపాధ్యక్ష పదవికి పోటీచేయమంటే సున్నితంగా తిరస్కరించారు. తనకు ఆ పదవికన్నా విద్యార్థులకు పాఠాలు చెప్పుకోవటం ఇష్టమన్నారామె. మనదేశం నుంచి అక్కడికి పోయి స్థిరపడిన వాళ్లు కూడా అదే రీతిలో అక్కడ పరిణతితో కూడిన రాజకీయం చేస్తూ ప్రజల మన్నన పొందుతున్నారు. గాంధీ, పటేల్, అంబేద్కర్, నెహ్రూల్లాగా మాతృదేశానికి వచ్చి అలాంటి రాజకీయం చేసే సాహసాన్ని వాళ్లు ఇంకా చేయలేకపోతున్నారనే బాధ ఉన్నా.. విదేశాల్లో మనవాళ్లు రాణిస్తుండటాన్ని తక్కువగా చూడలేం. అలాంటి ఒక ఎన్నారై కాట్రగడ్డ అరుణా మిల్లర్. 2000 సంవత్సరంలో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఎంత గందరగోళం జరిగిందో కొంతమందికైనా గుర్తుండి ఉంటుంది. రిపబ్లికన్ పార్టీ నుంచి జార్జి డబ్ల్యు బుష్, డెమోక్రాటిక్ పార్టీ నుంచి అల్‌గోర్ పోటీ పడ్డారు. ఎక్కువ ఓట్లు గోర్‌కి వచ్చినా సాంకేతికంగా బుష్ గెలిచినట్టు అమెరికా అత్యున్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. గోర్ హుందాగా పదవిని బుష్‌కి అప్పచెప్పారు. అయితే ఓటు వినియోగించుకున్న పౌరురాలిగా ఆ తీర్పు తనను బాధించటంతో తనకు చేతనైనంత మేర రాజకీయాలలో మార్పు తేవాలని అరుణ భావించారు. స్థానికంగా ఉన్న డెమోక్రాటిక్ పార్టీ కార్యాలయానికి ఫోన్ చేసి, 'నేను మీ పార్టీ కోసం పనిచేస్తాను, ఏం చేయమంటారు?' అని అడిగారు. వాళ్లు కార్యకర్త బాధ్యతల్ని అప్పగించారు. ఆ విధుల్లో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఓటు ప్రాధాన్యాన్ని వివరిస్తూ అరుణ ప్రచారం చేశారు. ఫోన్లు చేసి అభ్యర్థుల వివరాలు చెప్పటం, సమావేశాలు, సదస్సులు నిర్వహించటం, ఉపన్యాసాలు ఇవ్వటం, పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వివిధ స్థాయిల్లో పనిచేయటం చేశారు. పదేళ్ల తర్వాత మేరీల్యాండ్ డెలిగేట్‌గా పోటీ చేసే అవకాశం వచ్చింది. పదిమందికీ సాయం చేయటానికి ఇదో మంచి అవకాశం అని ఇంట్లో వాళ్లు ప్రోత్సహించటంతో అరుణ పోటీ చేసి గెలిచారు. ఇండియాలో శాసనసభ సభ్యురాలి లెక్క అన్నమాట. మనదేశంలో ఓ కార్పొరేటర్ వెళ్తుంటే ఎంతో ఆర్భాటం, చుట్టూ బోలెడంత ప్రొటోకాల్ తరహాలో ఉంటుంది. కానీ అమెరికాలో చాలా సీదాసాదాగా ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధుల్ని కూడా కలవొచ్చు. సమస్యల్ని అలా ప్రతినిధులు ప్రజల నుంచి నేరుగా తెలుసుకుంటుంటారు. ఇలా తెలుసుకున్న సమస్యలను పరిష్కరించే క్రమంలో.. అత్యాచార బాధితుల ఫిర్యాదుకు గడువు పొడిగించేలా చట్టసవరణకు ప్రైవేటు బిల్లు పెట్టి అరుణ ఆమోదం సాధించారు. డొనాల్డ్ ట్రంప్ వంటి కొన్ని అసాధారణ ధోరణులున్నా ఇండియాలోలా రాజకీయాలంటే రోజూ కార్యక్రమాలు చేయడం అమెరికాలో ఉండదని, సొంత ఉద్యోగం, వ్యాపారం, కార్యకలాపాలు చూసుకుంటూనే మంచి రాజకీయం చేయవచ్చని అరుణ తెలిపారు. సభ సమావేశాలు లేనప్పుడు ఉద్యోగాలు చేసుకుంటూ సాయంత్రం వేళ, సెలవు రోజుల్లో డెలిగేట్లు పనిచేయవచ్చు కాబట్టి తాను విద్యార్థులను ప్రోత్సహిస్తూ పేదవారికి ఉపకార వేతనాలనిచ్చే ఓ సంస్థతో కలిసిపనిచేస్తున్నానని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. మనదేశంలో కూడా లోక్‌సత్తా చెబుతున్నట్టు కేంద్రీకృత పాలన లేకుండా చేసి అధికారం పట్ల మోజును తగ్గిస్తే అరుణలా స్వచ్ఛందంగా మంచి రాజకీయాలు చేసే వారి సంఖ్య పెరుగుతుందనటంలో సందేహం లేదు. ○

# (మీడియాలో) 'కీ' కామెంట్లు !

■ ప్రచ్ఛన్న యుద్ధం తర్వాత దాదాపు పాతిక ప్రజాస్వామ్యాలు విఫలమయ్యాయి. టర్కీ ఆ దిశగానే సాగుతోంది. అమెరికన్ మీడియా సిద్ధాంతవేత్త డగ్లస్ రస్కాఫ్.. దీనికంతటికీ కారణం 'మన కాలపు అసహనమే'నని నిర్ధారించారు. దృష్టంతా స్వల్పకాలికమైన వాటి పైనే ఉంటోంది. ప్రారంభం, మధ్య, చివర అనే దృక్పథం కుప్పకూలుతోంది. అది ధ్యానాన్ని బోధించే గురువులు చెబుతున్నట్టుగా వుంటే అది వేరే విషయం. కానీ అలా సాగటం లేదు. ఫలితం, కందకాల యుద్ధాలన్నిటిలోలాగే.. రెండు ప్రత్యర్థి పక్షాల నడుమ సువిశాలమైన మధ్యస్త ప్రాంతం మిగిలింది. కందకాలను వీడి బయటకొచ్చే ధైర్యమే మీకుంటే ఈ మధ్యస్త ప్రాంతం ఎంత ఉపయోగకరమైనది కాగలదో ఇమాన్యుయెల్ మేక్రాన్ ఘనవిజయం మనకు చూపింది. మీరు ఎన్నికలలో గెలవాలంటే మధ్యస్త స్థానానికి చేరాలి. మేక్రాన్ గెలుపు, ట్రంప్ వైఫల్యాల రేటింగ్‌లు, ఏంజెలా మెర్కెల్ సంఘటితపడటం, బ్రెగ్జిట్ పట్ల విచారం వంటివి అన్నీ.. మహాసోమరితనంతో చాలా ఎక్కువగా మధ్యస్త ప్రాంతాన్ని వదిలిపెట్టేశారని రుజువు చేస్తాయి. మేక్రాన్ మన పదకోశానికి రాడికల్ మధ్యేవాదం, బలమైన మధ్యస్తపక్షం అనే దాన్ని చేర్చారు. విజ్ఞత ఒక్కోసారి అనుకోని చోట లభిస్తుంటుంది. అన్‌బాక్స్ జిందగీ (జీవితాన్ని తెరవండి) అంటూ స్నాప్‌డీల్‌కు ట్యాగ్‌లైన్ రాసిచ్చిన కాపీ రైటర్ బుర్రలోనూ కనిపించిందది. మనం, భారత ఉదారవాదులం మన బుర్రలను తెరుచుకోవాలి. సమాజం పట్ల, ఆర్థిక వ్యవస్థ పట్ల ఉదారంగా ఉండే, రాజ్యాంగబద్ధత పట్ల, జాతీయ భద్రత పట్ల రాజీ లేకుండా ఉండే, ఉగ్రవాదానికి లేదా మావోయిస్టు హింసకు "మూలకారణాల" సమర్థనను ఆమోదించకుండే భావనను నిర్మించాలి. అప్పుడు మీకు జంతర్ మంతర్ లేదా హేష్‌ట్యాగ్‌లతో దేన్నో లేదా ఏ పక్షాన్నో రుజువు చేసుకోవాల్సిన అవసరం ఉండదు.

–శేఖర్ గుప్తా,

సీనియర్ జర్నలిస్టు

■ పశ్చిమ దేశాల్లో వైద్యవిద్యలో భాగంగా నైతికత గురించి బోధిస్తున్నారు. భారతదేశంలోని వైద్య కళాశాలల్లో నైతిక సూత్రాలను పాఠ్యాంశంగా చేర్చలేదు. అలాంటి చర్య తక్షణం తీసుకోవాల్సిన అవసరం ఉంది. కుటుంబ వైద్యుడు అనే భావన భారతదేశంలో ప్రస్తుతం దాదాపు మరుగున పడిపోయింది. ప్రభుత్వం, సంబంధీకులు ఈ భావనకు మళ్లీ ఊపిరి పోయాల్సిన అవసరం ఉంది. అమెరికా తరహాలో కాకుండా బ్రిటిష్ తరహా వైద్యచికిత్సా విధానం దిశగా సాగాలి. అది ఉదార వైద్యవిధానం. దానివల్ల నీతి లేని వైద్య విధానాలకు భవిష్యత్తులో చెల్లుచీటీ రాయవచ్చు.

–డాక్టర్ పి.రఘురాం,

రొమ్ము క్యాన్సర్ నిపుణులు

■ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి మార్గదర్శి అన్న కథల సంపుటిని అందరూ తప్పక చదవాలి. అందులో గొప్ప అంశాలు చాలా చెప్పారు. ఉపాధి, ఉద్యోగం ఎవరో ఎందుకు సమకూర్చాలి? నిరంతరం సాగే వ్యవస్థలో ఎవరెక్కడ సరిపోతారో అక్కడ భాగస్వాములు కావాలి. ఉద్యోగాలు ఎక్కడో ఉన్నాయన్న అభిప్రాయం మంచిది కాదు. వాస్తవాలను చెప్పకపోవడం వల్లే సమస్య వచ్చింది.

–కె. చంద్రశేఖరరావు,

తెలంగాణ ముఖ్యమంత్రి

■ దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో ధరలు పతనమైనప్పుడు పంటలకు గిట్టుబాటు ధరలిప్పించేందుకు పరిష్కార మార్గాలు కనుగొనాలి. గతేడాది పలు పంటల ధరలు పతనమయ్యాయి. ఉదాహరణకు **2015-16**లో క్వింటా మినపధర రూ. **12**వేలుంటే, గత సీజన్‌లో రూ. **6**వేలకు పడిపోయింది. **2016-17**లో పప్పులు, నూనెగింజలు, పండ్లు వంటి పంటల సాగు వ్యయం కంటే మద్దతు ధరలు తక్కువగా ఉన్నట్టు సీఏసీపీ లెక్కలే చెబుతున్నాయి. నోట్ల రద్దు సైతం ధరల పతనానికి కారణమని కొన్ని సర్వేలు చెప్పాయి. ధరలు పతనమైనప్పుడు రైతులను ఆదుకునేందుకు ప్రత్యేకంగా 'ధరల స్థిరీకరణ నిధి' ఉండాలి. పంటల ఎగుమతులను నిషేధించటం రైతులను దెబ్బతీస్తోంది. ఇక్కడి మార్కెట్లో ధరలు పెరిగితే దిగుమతి ధర తగ్గిస్తుండటం వల్ల కూడా రైతులకు నష్టం జరుగుతోంది. అమూల్ పాల ధరను నిర్ణయిస్తున్న విధానాన్ని పండ్లు, కూరగాయలకు అనుసరించాలి. ధరల అస్థిరత నుంచి రైతులను కాపాడేందుకు ప్రభుత్వం ఇప్పటికీ ఒక వ్యవస్థను ఏర్పాటు చేయలేదు. చైనా, వియత్నాం వంటి దేశాల్లో చిన్న కమతాల్లోనే

అధిక ఉత్పాదన సాధిస్తున్నారు. చిన్న రైతుల పంటలను నేరుగా మార్కెట్లకు అనుసంధానం చేయడం, అధిక ధరలు కల్పించడం వీటిలో అతి ముఖ్యమైన విధానం. వారికి పంట నిల్వ, ఆహారశుద్ధి సదుపాయాలు సైతం అధికంగా ఉండటం వల్ల పంటలకు డిమాండ్ పెరిగింది. అలాగే సాగునీటి వసతి, రుణ సదుపాయం, ఆధునిక పరిజ్ఞానం వంటివన్నీ అక్కడ చిన్న రైతులకు అందుతున్నాయి. మనదేశంలో **10**శాతం పంటలకే శుద్ధి సదుపాయాలుండగా, మెరుగైన దేశాల్లో **70**శాతం వరకూ ఉన్నాయి. మన దగ్గర పంట కోత అనంతరం నష్టాలెక్కువ. సేద్యం, వైద్యం, పిల్లల చదువులు వంటి అంశాలన్నింటిలో రైతులకు సాయపడేలా వ్యవసాయ విధానాలుంటే రైతుల ఆత్మహత్యలను ఆపగలం.

**-ఎస్.మహేంద్రదేవ్,**

ప్రముఖ ఆర్థికవేత్త

■ నల్లడబ్బు విరాళాల రాజకీయాల్ని, ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేయటం ప్రభుత్వం ముందున్న అతి పెద్ద సవాలు.

**- అరుణ్ జైట్లీ,**

కేంద్ర ఆర్థిక మంత్రి

■ ఇప్పుడు గొప్ప ముందడుగుగా ప్రశంసిస్తున్న కొత్త పన్ను వ్యవస్థపై రాజకీయ వర్గాలు ఏకాభిప్రాయానికి రావడానికి ఇంచుమించు రెండు దశాబ్దాల కాలం ఎందుకు పట్టిందని వారిలో ఎవ్వరూ ప్రశ్నించలేదు. ప్రధాని మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జీఎస్టీ అమలును పదేపదే అడ్డుకున్న విషయమై ఎవరూ ఎటువంటి ప్రశ్నలు వేయలేదు. ఆదాయానికి మించి అపరిమిత ఆస్తులు కూడగట్టుకుంటూ ఎన్నికలలో విజయానికి తమ అక్రమ సంపదను వినియోగిస్తున్న మన ఎంపీలు కొత్త పన్నుల వ్యవస్థకు కట్టుబడి ఉండాలని పౌరులకు విజ్ఞప్తి చేయడంలో ఔచిత్యమేమిటని ఎవరూ ప్రశ్నించలేదు. ఆ మాటకొస్తే అర్ధరాత్రి జీఎస్టీ ప్రారంభోత్సవ వేడుకలకు, దాని గురించి మీడియాలో విశేష ప్రచారానికి చేస్తున్న వ్యయాన్ని ఎవరు భరించారని ఎవరూ ఎలాంటి ప్రశ్నలు అడుగలేదు. ఒక నిర్ణయంపై ప్రజాస్వామ్యబద్ధంగా అనంగీకారాన్ని తెలిపే స్వేచ్ఛ ప్రజలకు తప్పకుండా ఉండాలి. ప్రజాస్వామ్యమంటే ఐదేళ్లకోసారి మన నాయకులను ఎన్నుకోవడం మాత్రమే కాక, విధాన నిర్ణేతలను అనునిత్యం జవాబుదారీలు చేయడమనే సత్యాన్ని మనం అర్థం చేసుకోవాలి. ఒక్క జూన్ నెలలోనే బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లోను, కాంగ్రెస్ పాలిత కర్ణాటకలోను **25**మందికిపైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. అన్నదాతల ఈ దుస్థితిపై నగరవాసులు ఎప్పుడు నిరసన తెలుపుతారు? వ్యవసాయరంగ సంక్షోభంపై చర్చించడానికి పార్లమెంటు ఒక అర్ధరాత్రి సమావేశాన్ని ఎప్పుడు నిర్వహిస్తుంది?

**- రాజ్‌దీప్ సర్దేశాయి,**

సీనియర్ జర్నలిస్టు

■ ఇండియాకు క్రికెట్ ప్లేయర్ కావడం సులభమేమో కానీ రాజకీయ నాయకుడిగా కావడం చాలా కష్టం. రాజకీయ నాయకుడు అవ్వాలంటే మొట్టమొదట లౌక్యం ఉండాలి. జ్ఞాపకశక్తి, ధారణశక్తి ఉండాలి. మొహం మీద చిరునవ్వు ఉండాలి. తనకన్నా పైవాళ్లను మంచి చేసుకునే నేర్పు ఉండాలి. అన్నింట్లో వెసులుబాటు చేసుకుంటూ పైకి ఎగబాకే తత్వం కూడా ఉండాలి. పైవాళ్లను నొక్కేసి తాను పైకి వెళ్లినా సరే, తన కిందివాళ్లను పైకి తెచ్చే తెలివి కూడా ఉండాలి.

**-యండమూరి వీరేంద్రనాథ్,**

రచయిత

■ భారత్‌లో ప్రజాస్వామ్యం పది సంవత్సరాల క్రితం కంటే నేడు ఎక్కువగా ఉన్నదా? లేక తక్కువగా ఉన్నదా?.. ఎక్కువగా ఉన్నదనీ చెప్పలేము, తక్కువగా ఉన్నదనీ చెప్పలేము. ఆ రెండు వాస్తవాలను అంగీకరించడమే బహుశా పై ప్రశ్నకు సరైన సమాధానమని చెప్పవచ్చు. గత పదేళ్లలో భారత ప్రజాస్వామ్య నాణ్యత కొన్నిరకాలుగా శిథిలమవ్వగా సామాజిక, ఆర్థిక ప్రజాస్వామ్యం కొంతమేర వృద్ధి చెందింది. స్వతంత్ర భారత వజ్రోత్సవ సంవత్సరం **(2007)**లో వలే ఇప్పుడూ మన ప్రజాస్వామ్యం లోపభూయిష్టంగా, అసంపూర్ణంగా ఉంది. భారత గణతంత్ర రాజ్యం ఏవిధంగానూ హిందూ పాకిస్తాన్ కాదు. అయితే నిత్యజీవితంలో హింసాకాండ, మన ప్రభుత్వ వ్యవస్థల ప్రమాణాలు దిగజారిపోవడం గమనిస్తే మన దేశం దక్షిణాసియా కెనడా అని చెప్పడానికి కూడా వీలు కాదు.

**- రామచంద్ర గుహ,**

చరిత్రకారులు

*(కర్టెసీ: ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, వెబ్, సోషల్ మీడియా)*

# ప్రజల భాగస్వామ్యంతో శాస్త్రీయంగా భూముల రీ సర్వే చేయాలి, 'పౌర సేవల' చట్టం తేవాలి: జేపీ

ప్రజల భాగస్వామ్యంతో శాస్త్రీయంగా భూముల రీ సర్వే జరగాలని, జీఆర్ఎస్, గ్లోబల్ పొజిషనింగ్ ద్వారా భూముల హద్దులను నిర్ణయించాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. భూముల రికార్డులను సక్రమంగా స్థిరీకరించాలని, ముందున్న రికార్డులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని అన్నారు. భూ రికార్డులను ప్రజలకు అందుబాటులో ఉంచటమే సమాచార హక్కు (ఆర్టీఐ)ని కల్పించడం అవుతుందన్నారు. రెవెన్యూశాఖ మానవీయ కోణంలో ఆలోచించి భూమికి, మనిషికి ఉండే సంబంధాన్ని కాపాడాలని అన్నారు.




అనకాపల్లి గవరపాలెంలోని గౌరీ గ్రంథాలయంలో 'భూములు-రికార్డులు-పౌరసేవలు-ఆర్టీఐ'పై లోక్‌సత్తా తోడ్పాటుతో ఆర్టీఐ కార్యకర్తల సంస్థ పబ్లిక్‌ఫోరం నిర్వహించిన బహిరంగ సదస్సులో జేపీ ముఖ్య అతిథిగా పాల్గన్నారు. పలుచోట్ల భూమి రికార్డుల ట్యాంపరింగ్, ప్రభుత్వ భూముల కబ్జాలు, 'సిట్' ఏర్పాటు, ప్రభుత్వ, ప్రయివేటు ఏజెన్సీల దర్యాప్తు, రాజకీయ పక్షాల ఆందోళనల నేపథ్యంలో ఈ సదస్సును పార్టీలకతీతంగా ఏర్పాటు చేశారు.

ప్రభుత్వాలు ప్రజల కోసం పనిచేయటం మానేశాయని, అందువల్లే జనానికి పన్నులు పెరుగుతున్నాయి తప్ప సమస్యలు తీరటం లేదని జేపీ అన్నారు. మనవారి కంటే బ్రిటిష్ పాలకులే భూరికార్డుల నిర్వహణ విషయంలో చక్కగా వ్యవహరించారన్నారు. ప్రతి 30 ఏళ్లకూ విధిగా భూసర్వే చేయించేవారన్నారు. గత కొన్నేళ్లుగా సర్వే అనేదే లేకుండా పోయిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీరామారావు అన్ని రికార్డులతో హైదరాబాద్‌లో కొనుగోలు చేసిన భూమిని సైతం అంతకంటే ముందే భూయజమాని మరొకరికి అమ్మేశారన్నారు.

రిజిస్ట్రేషన్‌కు ముందు భూమి సర్వే తప్పనిసరిగా చేయాలని జేపీ అన్నారు. రిజిస్ట్రేషన్‌కు ముందు సర్వే చేయించడం వల్ల కొనుగోలుదారులు, అమ్మకందారులకు కూడా మేలు జరుగుతుందన్నారు. సరైన విస్తీర్ణం, సర్వే నెంబర్లు, సబ్ డివిజన్లతో సహా కచ్చితమైన రిజిస్ట్రేషన్ దస్తావేజుల తయారీకి ఉపయోగపడుతుందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ, గ్రామసభల్లో అభ్యంతరాలను స్వీకరించటంతో రికార్డులను సరిచేయాలన్నారు. ప్రజలకు చుక్కలు చూపిస్తున్న వెబ్‌ల్యాండ్‌ను సంస్కరించాలన్నారు. శాస్త్రీయత, సరైన పరిశీలన లేకుండా తప్పుల తడకగా రూపొందించిన నిషేధిత ఆస్తుల జాబితాను సవరించాలని, భూ లోక్‌అదాలత్‌లను ఇందుకు వినియోగించుకోవాలని అన్నారు. 2016 జులైలో హైకోర్టు జారీ చేసిన ఆదేశాలను తక్షణం అమలు చేయాలన్నారు. 37 ఏళ్ల క్రితం అప్పటి రెవెన్యూమంత్రి అందరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు అందాలని చెప్పారని, కానీ ఇప్పటికీ లంచం ఇస్తే తప్ప పాస్ పుస్తకాలు అందటం లేదన్నారు. ప్రతి పనికీ లంచాలు మామూలైపోయాయని, అవినీతి అంతానికి ప్రభుత్వ కార్యాలయాల్లో 'పౌర సేవల' చట్టంతో సిటిజన్ ఛార్టర్లను అమలు చేయాలన్నారు. ప్రజలకు హక్కుగా చేసి పెట్టాల్సిన పనులు చేయకపోతే ప్రభుత్వాన్ని డిమాండ్ చేసే శక్తిని ప్రజలకు ఈ చట్టం ఇస్తుందన్నారు. పౌర సేవల చట్టం నమూనాను తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులకు లోక్‌సత్తా ఇప్పటికే పంపినా కబుర్లు తప్ప కార్యాచరణ లేదన్నారు. దీనిపై జనచైతన్య యాత్ర ద్వారా ప్రజల్లో చైతన్యం తెస్తామన్నారు. భూములు, రికార్డుల అంశంపై అనకాపల్లి గౌరీ గ్రంథాలయం చేపట్టిన బృహత్ కార్యానికి సహాయసహకారాలను అందిస్తానని జేపీ హామీ ఇచ్చారు.

లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ, విశాఖపట్నంలో భూ కుంభకోణాలపై మొట్టమొదట లోక్‌సత్తాయే స్పందించిందన్నారు. గౌరీ గ్రంథాలయం కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ.. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. మునిసిపల్ మాజీ ఛైర్మన్ మళ్ల సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో గౌరీ గ్రంథాలయ అధ్యక్షుడు మళ్ల సత్యనారాయణ, రాష్ట్ర వ్యవసాయదార్ల సంఘం అధ్యక్షుడు పీఎస్ అజయ్ కుమార్, ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, లోక్‌సత్తా నియోజకవర్గ ఇంఛార్జి మారిశెట్టి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ○

తప్పక చదవండి ! చదివించండి !!

పేజీలు : 64

వెల : రూ. 20 /-

Lok Satta
People Power

Lok Satta Party

# లోక్‌సత్తా 20+:
# 100 నిజాలు (విజయాలు)
# మాట్లాడుకుందాం !



Posting Date 07-09-2017
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on September 1st, 2017



FOLLOW ME ON twitter

**Friends, Interacting with youngsters always gives me immense pleasure. You can tweet your suggestions , ideas , queries to :**

**@JP_LOKSATTA**

**I will try to respond to as many as possible**

**DR.JAYAPRAKASH NARAYAN, FOUNDER, LOKSATTA**

| Book-Post<br>PRINTED MATTER | To |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad